ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీ సత్యసాయి
జిల్లా వార్తలు
ఆదివారం 21 ఏప్రిల్ 2024

అక్కడ ఫుల్..!




ఏపీలో కన్నా కర్ణాటకలో పెట్రోల్ ధరలు తక్కువగా ఉన్నాయి. దీంతో జిల్లాలోకి ప్రవేశించే వాహనాలు సరిహద్దులోని కర్ణాటక పెట్రోల్ బంకుల్లోనే ఇంధనం నింపుకొని వస్తున్నాయి. చాలావాహనాలు ఫుల్ ట్యాంకు చేసుకుని వస్తున్నాయి. కొందరైతే క్యాన్లలో అదనంగా కూడా తెచ్చుకుంటున్నారు. దీంతో సరిహద్దులోని కర్ణాటక పెట్రోల్ బంకులు నిత్యం వాహనాలతో రద్దీగా ఉంటున్నాయి. విక్రయాలతో కళకళలాడుతున్నాయి. చిలమత్తూరు మండలంలోని కొడికొండ చెక్‌పోస్టు సమీపాన కర్ణాటకలోకి ప్రవేశించే చోట ఉన్న ఈ పెట్రోల్ బంకు నిత్యం రద్దీగా ఉంటోంది.

ఇక్కడ నిల్..!



ఏపీలో కన్నా కర్ణాటకలో పెట్రోల్ ధరలు తక్కువగా ఉన్నాయి. జిల్లాలోకి ప్రవేశించే వాహనాలు సరిహద్దులోని కర్ణాటక పెట్రోల్ బంకుల్లోనే ఇంధనం నింపుకొని వస్తున్నాయి. దీంతో సరిహద్దులోని ఏపీ పెట్రోల్ బంకుల్లో కొనేవారు కరువయ్యారు. నిర్వహణ భారమై, మూతపడుతున్నాయి. చిలమత్తూరు మండలం కొడికొండ చెక్‌పోస్టు సమీపాన కర్ణాటక సరిహద్దుకు ఆనుకుని ఉన్న ఏపీ పెట్రోల్ బంకు దుస్థితి ఇది. బంకును మూసేయడంతో ఇలా కంపచెట్లు పెరిగిపోయాయి.

ఏపీకంటే కర్ణాటకలో పెట్రోల్, డీజిల్ ధరలు తక్కువగా ఉన్నాయి. దీంతో ఏపీకి వెళితే బాదుడే.. ఇక్కడే ఫుల్‌గా నింపుకుని వెళ్లండంటూ కొన్నేళ్లుగా జిల్లా సరిహద్దు కర్ణాటకలోని పెట్రోల్ బంకుల వద్ద బోర్డులు ఏర్పాటు చేశారు. జాతీయ రహదారులు మొదలుకుని గ్రామీణ దారుల్లో భారీగా పెట్రోల్ బంకులు ఏర్పాటు చేశారు. జిల్లాలో శుక్రవారం పెట్రోల్ లీటరు రూ.110.52 కాగా, డీజిల్ రూ.98.38 ఉంది. కర్ణాటకలోని బంకుల్లో పెట్రోల్ రూ.100.31, డీజిల్ రూ.86.16కి విక్రయిస్తున్నారు. ఏపీకంటే కర్ణాటకలో డీజిల్ లీటరుపై రూ.12.02, పెట్రోల్‌పై రూ.10.21 తక్కువగా ఉంది. ఇలా కర్ణాటకలోని పెట్రోల్ బంకుల్లో రోజుకు సగటున 69 వేల నుంచి 80 వేల లీటర్ల డీజిల్, పెట్రోల్ అమ్మకాలు సాగుతున్నాయి. లక్ష లీటర్లకుపైగా విక్రయించే బంకులు కూడా ఉన్నాయి. కర్ణాటకలో పెట్రోల్, డీజిల్ ధరలు తక్కువగా ఉండడంతో అక్కడే వాహనాలు నింపుకొస్తున్నారు. ఇది జిల్లాలో డీజిల్ అమ్మకాలపై ప్రభావం చూపింది. ఐదేళ్లుగా కర్ణాటకలో పెట్రోల్, డీజిల్ అమ్మకాలు భారీగా పెరగడంతో జాతీయ రహదారి 44 మీదుగా కర్ణాటక వైపు వేళ్లే గ్రామీణ రహదారుల్లో సైతం చమురు కంపెనీలు పోటీపడి పెట్రోల్ బంకులను ఏర్పాటు చేస్తున్నాయి. జిల్లాలో మాత్రం ఉన్న బంకులు మూతపడుతున్నాయి.

ఏపీకి వెళ్తే.. వీరబాదుడే

బతుకులు బంద్

వైసీపీ పాలనలో పెట్రోల్, డీజిల్‌పై వ్యాట్ బాదుడు

- కర్ణాటక కన్నా అధికంగా ధరలు
- సరిహద్దు పెట్రోల్ బంకులపై తీవ్ర ప్రభావం
- కర్ణాటకలోనే నింపుకుంటున్న వాహనదారులు
- ఇక్కడ కొనేవారు కరువు
- మూతపడుతున్న బంకులు
- నిర్వాహకులు అప్పులపాలు
- ఉపాధి కోల్పోయి కార్మికులు వలసబాట

పుట్టపర్తి, ఏప్రిల్20(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం వ్యాట్ దెబ్బకు కర్ణాటక సరిహద్దులోని పెట్రోల్ బంకులు మూతపడుతున్నాయి. దీంతో వేలాది మంది ఉపాధి కోల్పోయి, వలస వెళ్లాల్సి వస్తోంది. వైసీపీ అధికారం చేపట్టాక పెట్రోల్, డీజిల్‌పై వ్యాట్ తగ్గించకపోగా.. ధరల బాదుడు బాదారు. వెరసి పక్క రాష్ట్రాల్లో కన్నా ఏపీలో ఇంధనం ధరలు ఎక్కువగా ఉన్నాయి. ఇది సరిహద్దులోని ఏపీ పెట్రోల్ బంకులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. కర్ణాటక సరిహద్దులోని తనకల్లు మండలం నుంచి కదిరి, హిందూపురం, మడకశిర, కళ్యాణదుర్గం, రాయదుర్గం, ఉరవకొండ, విడపనకల్లు, గుంతకల్లు వరకు వందల పెట్రోల్ బంకుల మనుగడ ప్రశ్నార్థకమై, మూతేశారు. ఏపీకంటే కర్ణాటకలో పెట్రోల్, డీజిల్ ధరల్లో లీటరుపై రూ.10నుంచి రూ.12 వరకు తక్కువగా ఉంటోంది. దీంతో జిల్లా సరిహద్దులోని కర్ణాటక పెట్రోల్ బంకులు రద్దీగా ఉంటున్నాయి. పెట్రోల్, డీజిల్ అమ్మకాలు భారీగా పెరిగాయి. అదే సమయంలో సరిహద్దులోని జిల్లాకు చెందిన పెట్రోల్ బంకులు మూతపడుతున్నాయి. వందలాది బంకులు మూతపడ్డాయి. వాటి నిర్వాహకులు అప్పులు మూటగట్టుకోగా.. వేలాదిమంది కార్మికులు ఉపాధి కోల్పోయారు. కేంద్రంతోపాటు పక్క రాష్ట్రాల్లో పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించినా.. వైసీపీ ప్రభుత్వం దిగిరాలేదు. ఫలితంగా సరిహద్దు రహదారుల్లో కర్ణాటక పెట్రోల్ బంకుల జోరు కొనసాగుతోంది. జిల్లా సరిహద్దు పెట్రోల్ బంకులు కుదేలయ్యాయి. 'కర్ణాటక సరిహద్దు దాటుతున్నారా.. మీ వాహనాల్లో డీజిల్, పెట్రోల్ నింపుకోండి.. ఏపీలోకి అడుగుపెడితే బాదుడే' అంటూ అక్కడి పెట్రోల్ బంకుల్లో బోర్డులు పెట్టి మరీ విక్రయాలు సాగిస్తున్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.




- పెట్రోల్ బంకులో గ్రానైట్ విక్రయాలు

ఔను. నమ్మడానికి వింతగా ఉన్నా ఇది నిజమే. చిలమత్తూరు మండలం కొడికొండ చెక్‌పోస్టులోని పెట్రోల్ బంకు దుస్థితి ఇది. ఇక్కడికి కిలోమీటరు దూరంలో కర్ణాటక సరిహద్దు ఉంది. వైసీపీ ప్రభుత్వం వ్యాట్ బాదుడుతో జిల్లాలో కంటే కర్ణాటకలో పెట్రోల్, డీజిల్ ధరలు లీటరుపై రూ.10 నుంచి రూ.12 దాకా తక్కువగా ఉన్నాయి. దీంతో వాహనదారులు కర్ణాటకలోనే వాహనాలకు పెట్రోల్, డీజిల్ నింపుకొస్తున్నారు. స్థానికులు కూడా సమీపంలోని సరిహద్దుకెళ్తున్నారు. దీంతో సరిహద్దులోని కొడికొండ చెక్‌పోస్టులో డీజిల్, పెట్రోల్ కొనేవారు కరువయ్యారు. విక్రయాల్లేక నిర్వహణ భారమై, బంకులు మూతపడుతున్నాయి. ఫొటోలోని బంకు కూడా అలా మూతపడినదే. ఖాళీగా ఉండడంతో గ్రానైట్ విక్రయాలు సాగిస్తున్నారు.




కొడికొండ వద్ద జాతీయ రహదారి పక్కన మూతపడిన పెట్రోల్ బంకు


మడకశిరలోని మధుగిరి రోడ్డులో విక్రయాలు లేని పెట్రోల్ బంకు

కర్ణాటక వైపు పరుగులు..

వైసీపీ అధికారంలోకి వచ్చాక పెట్రోల్, డీజిల్‌పై వ్యాట్ తగ్గించకపోవడంతో జిల్లా సరిహద్దులో పెట్రోల్ బంకుల నిర్వహణ పెనుభారంగా మారింది. గతంలో కళకళలాడిన పెట్రోల్ బంకులు ప్రస్తుతం వంద లీటర్ల పెట్రోల్, డీజిల్ అమ్మకాలు కూడా లేక వందకుపైగా మూతపడ్డాయి. జిల్లా సరిహద్దులో పెట్రోల్ బంకుల నిర్వాహకులు అప్పులు మూటగట్టుకోగా.. అందులో పనిచేస్తున్న కార్మికులు ఉపాధి కోల్పోయారు. బంకుల్లో పనిచేసే పంపుబాయిస్, సూపర్‌వైజర్లు, మేనేజర్లు, అకౌంటెంట్, టెక్నీషియన్లు ఉపాధి కోసం కర్ణాటకకు వేలాది మంది వలస వెళ్లారు. పెట్రోల్ బంకుల నిర్వహణకు చేసిన అప్పులు తీర్చలేక చాలామంది నిర్వాహకులు వాటిని మూత వేసి, ఊర్లు విడిచి కర్ణాటక ప్రాంతాలకు వలస వెళ్లారు.

నిర్వహణ భారమై బంద్ చేశా



కర్ణాటక సరిహద్దు కొడికొండ చెక్‌పోస్టు సమీపాన జాతీయ రహదారి పక్కన పెట్రోల్ బంకు ఏర్పాటు చేశాం. గతంలో రోజూ 30వేల లీటర్లకుపైగా పెట్రోల్, డీజిల్ అమ్మకాలు సాగేవి. రాష్ట్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్‌పై వ్యాట్ విధించడం, తర్వాత తగ్గించకపోడవంతో అమ్మకాలు ఆగిపోయాయి. రోజుకు కనీసం వంద లీటర్లు కూడా విక్రయించలేని పరిస్థితి ఏర్పడింది. సరిహద్దులోని బంకుల నిర్వాహకుల సమస్యలను ప్రభుత్వానికి పలుమార్లు విన్నవించాం. నిర్వహణ భారమై నాలుగేళ్ల కిందటే బంకు మూసేశాం. కార్మికులు కర్ణాటకకు వలస వెళ్లారు.
- పాపన్న, పెట్రోల్ బంకు నిర్వాహకుడు, కొడికొండ చెక్‌పోస్టు, చిలమత్తూరు మండలం



ఐదేళ్లుగా బాదుడే



డీజిల్, పెట్రోల్‌పై వ్యాట్ పెంపు ద్వారా ఐదేళ్లలో జనంపై రూ.వందల కోట్లు బాదేశారు. పక్క రాష్ట్రం కర్ణాటకలో పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గిస్తే ఏపీ ప్రభుత్వం తగ్గించకపోగా.. ప్రజలపై ఇంత భారం మోపడం సరికాదు. ఐదేళ్లుగా ఇబ్బందులు పడుతున్నాం. కర్ణాటకకు వెళితే అక్కడే ద్విచక్రవాహనాలకు పెట్రోల్ నింపుకొస్తాం. డీజిల్, పెట్రోల్ ధరలు అత్యధికంగా ఉన్న రాష్ట్రం ఏపీయేనడంలో సందేహం లేదు.
- శివకుమార్, కొడికొండ చెక్‌పోస్టు

పదింతలు లాక్కోవడం అంటే ఇదేనేమో?



మాగ్రామం కర్ణాటక సరిహద్దులో ఉంది. ఐదారు కిలోమీటర్లు వెళితే కర్ణాటక పెట్రోల్ బంకులు ఉన్నాయి. జిల్లాలో కన్నా పెట్రోల్ లీటరుపై రూ.10 తక్కువ. అత్యవసరమైతే తప్ప.. ఇక్కడ పెట్రోల్, డీజిల్ కొనుగోలు చేయం. కర్ణాటకకు వెళ్లి ఐదారు లీటర్లు ద్విచక్రవాహనంలో వేయించుకుంటాం. కర్ణాటకలో ధరలు తగ్గిస్తే.. ఇక్కడ మాత్రం పెంచారు.
- గోవిందప్ప, నరసంబూది, అగళి మండలం

ప్రాంతం	పుట్టపర్తి	కదిరి	ధర్మవరం	హిందూపురం	పెనుకొండ
గరిష్ఠం కనిష్ఠం	36.0 26.0	36.0 26.0	37.0 27.0	36.0 25.0	35.0 26.0

హమ్మయ్య.. వానొచ్చింది..!

కొత్తచెరువులో వర్షం


కొత్తచెరువులో కురుస్తున్న వర్షం

కొత్తచెరువు, ఏప్రిల్ 20: వేసవి తాపం, మండే ఎండలతో విలవిల్లాడుతున్న జిల్లా ప్రజలకు కాస్త ఉపశమనం. జిల్లాలోని పలు ప్రాంతాల్లో శనివారం చినుకులు నేలరాలాయి. కొత్తచెరువులో ఓ మోస్తారు వర్షం కురిసింది. దీంతో ఉక్కపోత నుంచి జనం ఉపశమనం పొందారు.

గుండెపోటుతో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి మృతి


జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ కృష్ణయ్య (ఫైల్)

పుట్టపర్తి రూరల్, ఏప్రిల్ 20: జిల్లా వ్యాధి నిరోధక (ఇమ్యునైజేషన్) విభాగాధికారిగా పనిచేస్తున్న డాక్టర్ కృష్ణయ్య (57) గుండెపోటుతో శనివారం తెల్లవారుజామున మృతిచెందారు. ఈయన నెల్లూరు జిల్లా సూళ్ళూరుపేట నుంచి ఇటీవల జిల్లాకు బదిలీపై వచ్చారు. సత్యసాయి హాస్పిటల్ సమీపాన అద్దెకు ఉంటుండేవారు. శనివారం తెల్లవారుజామున ఒక్కడే ఉండగా.. ఛాతీలో నొప్పి వచ్చింది. వెంటనే ఆ శాఖ సిబ్బందికి ఫోన్ చేయడంతో వారు వచ్చి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించారు. ఈయనకు భార్య, ఎంబీబీఎస్ చదివే కుమారుడు, ఇంటర్మీడియట్ చదువుతున్న కూతురు ఉన్నారు. కృష్ణయ్య మృతికి జిల్లా వైద్యశాఖాధికారులు, సిబ్బంది దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

ముస్లిం పథకాలన్నీ మటాష్..!

- అన్నింటినీ అటకెక్కించిన జగన్
- ఇచ్చిన హామీలూ నెరవేర్చని దుస్థితి
- మైనార్టీల్లో ఆగ్రహం




ధర్మవరంలోని ఈద్గా మైదానం...



టీడీపీ హయాంలో సంక్షేమ పథకాలు



టీడీపీ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు.. ముస్లింల సంక్షేమానికి ఎన్నో పథకాలు అమలు చేశారు. మసీదుల్లో ఇమాంలు, మౌజాన్లకు ప్రతినెలా గౌరవ వేతనం ఇచ్చారు. దుల్హాన్ పథకాన్ని ప్రవేశపెట్టి ముస్లిం వధువు కుటుంబానికి రూ.50 వేలు ఆర్థికసాయం అందజేశారు. మసీదులు, ఈద్గాల మరమ్మతులకూ నిధులిచ్చారు. రంజాన్‌తోఫా, జీవనోపాధికి 50శాతం సబ్సిడీతో రుణాలు, మైనార్టీ కార్పొరేషన్ ఏర్పాటు చేసి, ఆ వర్గానికి అండగా నిలిచారు. గత ఎన్నికలకు ముందు జగన్ పాదయాత్ర సమయంలో ముస్లింలకు అనేక హామీలు గుప్పించారు. ఇస్లామిక్ బ్యాంకు, దుల్హాన్ పథక లబ్ధిని రూ.50వేలనుంచి రూ.లక్షకు పెంచుతాననీ, ఇమామ్‌లకు రూ.10వేలు, మసీదు, ఈద్గాల మరమ్మతులకు రూ.25వేలు, విదేశీవిద్య తదితర హామీలిచ్చారు. అధికారం చేపట్టాక వాటన్నింటినీ విస్మరించాడు. వాటిలో ఏ ఒక్కటీ అమలు చేయలేదని ముస్లింలు మండిపడ్డారు. రంజాన్‌తోఫా రద్దును రద్దు చేయడంతోపాటు సబ్సిడీ రుణాల పంపిణీకి తిలోదకాలిచ్చారు. మైనార్టీ కార్పొరేషన్‌ను నామమాత్రం చేశారు. ఉర్దూ అకాడమీని అస్తవ్యస్తంగా మార్చేశారు.

ముస్లింలకు ఎన్నెన్నో హామీలు గుప్పించిన జగన్.. అధికారం చేపట్టాక అన్నింటినీ అటకెక్కించాడు. తద్వారా ఆ వర్గాలకు తీవ్ర అన్యాయం చేశాడు. అప్పటికే అమలవుతున్న పథకాలన్నింటినీ ఆపేశాడు. తాను ఇచ్చిన హామీలను సైతం అమలు చేయలేదు. దీంతో వైసీపీ పాలనలో ముస్లింలకు తీవ్ర అన్యాయం వాటిల్లింది. దీంతో ఆ వర్గాలు వైసీపీ ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నాయి.
-ధర్మవరం

దుల్హాన్ పథకం పేద ముస్లింలకు వరం

టీడీపీ హయాంలో ప్రవేశపెట్టిన దుల్హాన్ పథకం పేద ముస్లింలకు వరం. రంజాన్ పండుగకు తోఫా అందించేవారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక టీడీపీ అందిస్తున్న పథకాలన్నింటినీ రద్దు చేసింది. వైసీపీ ఐదేళ్లలో ఈద్గా, మసీదుల ఊసే లేదు. ముస్లింలు జగన్‌ను నమ్మి ఓటు వేసి గెలిపిస్తే.. వారి కోసం చేసిందేమీ లేదు.




- బాబావలి, ధర్మవరం

ముస్లింలను వంచించిన జగన్



మైనార్టీలకు సామాజికంగా, ఆర్థికంగా ఆదుకునేది చంద్రబాబునాయుడు ఒక్కరే. జగన్ ప్రభుత్వం ముస్లింలను వంచించింది. వడ్డీలేని రుణాలిస్తామని ఆశ పెట్టారు. మాటలు కోటలు దాటాయే తప్ప.. వాటిని అమలు చేసింది లేదు. మసీదులు, ఈద్గాల నిర్వహణ గాలికొదిలేశారు. - షామీర్, ధర్మవరం

ఐదేళ్లలో రాయితీ రుణాల్లేవు



ఐదేళ్ల జగన్ పాలనలో ముస్లింలకు రాయితీ రుణాలే ఇవ్వలేదు. ఇస్లామిక్ బ్యాంకు ఏర్పాటుచేస్తానని హామీ ఇచ్చి, మోసం చేశారు. హామీలు నెరవేర్చకపోగా.. మైనార్టీలపై దాడులకు పాల్పడ్డారు. రంజాన్‌తో ఫాతోపాటు విదేశీవిద్యకు పేద ముస్లింలు దూరమయ్యారు.
- ఫర్హానా, ధర్మవరం

కంపచెట్ల రోడ్డు..!


బొక్సంపల్లి-కోగిర సీసీ రోడ్డుకు అడ్డంగా పెరిగిన ముళ్లకంపలు



తారు, సిమెంటు రోడ్లు విన్నాం కానీ, కంపచెట్ల రోడ్డు ఏంటి అనుకుంటున్నారా? ఈ ఫొటోలో కనిపిస్తున్న దానిని సిమెంటు రోడ్డు అనడం కంటే కంపచెట్ల రోడ్డు అనడమే కరెక్టేమో. రొద్దం మండంలోని బొక్సంపల్లి నుంచి కోగిర గ్రామానికి వెళ్లే సీసీ రోడ్డు ఇది. రెండు గ్రామాలను కలిపే రోడ్డు అయినా.. నిర్వహణ గాలికొదిలేశారు. రోడ్డుకిరువైపులా ఉన్న కంపచెట్ల కొమ్మలు రోడ్డుకు అడ్డంగా పెరిగాయి. రోడ్డును పూర్తిగా ఆక్రమించేశాయి. వాహనాలు వెళ్లే అవకాశమే లేదు. టీడీపీ హయాంలో ఈ సీసీ రోడ్డు నిర్మించారు. వైసీపీ అధికారం చేపట్టాక నిర్వహణను గాలికొదిలేశారు. సీసీ రోడ్డుకిరువైపులా ముళ్లకంపలు పెరిగిపోయినా పట్టించుకునే నాథుడే లేదు. అధిక వర్షాల కారణంగా రెండేళ్ల క్రితం గ్రామ సమీపాన సీసీ రోడ్డు కొట్టుకుపోయి, పెద్ద గొయ్యిపడింది. వాటి మరమ్మతులు చేపట్టేందుకు కూడా నిధులు లేకపోవడంతో అలాగే వదిలేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, కంపచెట్లు తొలగించాలని గ్రామస్థులు కోరుతున్నారు. -రొద్దం

ప్రచార ఖర్చులపై నిఘా పెట్టండి

ఎన్నికల వ్యయ పరిశీలకుడు అమిత్‌కుమార్



మాట్లాడుతున్న అమిత్‌కుమార్

పుట్టపర్తి, ఏప్రిల్ 20: ఎన్నికల్లో అభ్యర్థుల ప్రచార ఖర్చులపై నిరంతరం నిఘా పెట్టాలని హిందూపురం పార్లమెంటు నియోజకవర్గ వ్యయపరిశీలకుడు అమిత్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీల ఎన్నికల ఖర్చుల పర్యవేక్షణపై శనివారం నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. వ్యయ పరిశీలకుడు మాట్లాడుతూ.. ఓటర్లకు నగదు, బహుమతుల పంపిణీపై సీవిజిల్ ద్వారా ఫిర్యాదు చేసేలా ప్రజలను ప్రోత్సహించాలన్నారు. బ్యాంకుల ద్వారా సాగే నగదు లావాదేవీలు, రూ.5 లక్షలకు మించి నగదు డిపాజిట్లు, మద్యం షాపులకు సరుకు రవాణాపై నిఘా ఉంచాలన్నారు. అనంతరం కలెక్టర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ.. జిల్లాలో వ్యయ పరిశీలకుల పనితీరు గురించి వివరించారు. ప్రచారానికి అనుమతులు, ఎన్నికల నిర్వహణ ప్రణాళికపై వివరించారు. కర్ణాటక సరిహద్దులో చెక్‌పోస్టుల ఏర్పాటు, వాటి పనితీరు, సీజ్ చేసిన మద్యం, నగదు, బంగారం వివరాలను జిల్లా ఎస్పీ మాధవరెడ్డి వివరించారు. కార్యక్రమంలో పుట్టపర్తి, ధర్మవరం, కదిరి నియోజవర్గాల వ్యయపరిశీలకులు రిదమ్‌బజ్వా, డీఆర్వో కొండయ్య పాల్గొన్నారు.

ఫ్లయింగ్ స్క్వాడ్

చురుగ్గా పనిచేయాలి: కలెక్టర్

పుట్టపర్తి, ఏప్రిల్ 20: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఫ్లయింగ్ స్క్వాడ్ చురుగ్గా పనిచేయాలని జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. ఈ మేరకు శనివారం ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో భాగంగా 50 వేలకు మించి నగదు తరలించకుండా నిఘా ఉంచాలన్నారు. సీజ్ చేసిన వస్తువులపై త్రిసభ్య కమిటీ ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు సీజ్ చేసిన మొత్తాల గురించి త్రిసభ్య కమిటీ ఎదుట హాజరై, సరైన ఆధారాలు చూపించి, నగదు, ఆభరణాలు, వస్తువులను తిరిగి తీసుకునేందుకు ఉత్తర్వులు జారీ చేశామన్నారు. సమాచారం కోసం 9154840096 నంబరులో సంప్రదించాలన్నారు.

పిడుగుపాటుతో మేకల కాపరి మృతి


వీరప్ప (ఫైల్)

పుట్టపర్తి రూరల్, ఏప్రిల్ 20: మండలంలోని దిగువచెర్లోపల్లికి చెందిన మేకల కాపరి ఆకుల వీరప్ప (65) శనివారం పిడుగుపాటుతో మరణించాడు. వీరప్ప మేకలను మేపు నిమిత్తం అడవికి తోలుకెళ్లాడు. సాయంత్రం ఇంటికి వస్తుండగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం మొదలవడంతో గ్రామంలోని బస్టాండు సమీపాన గల చెట్టు కిందకు వెళ్లాడు. చెట్టుపై పిడుగుపడి అక్కడికక్కడే మృతిచెందినట్లు గ్రామస్థులు తెలిపారు. వీరప్పకు భార్య లక్ష్మీదేవమ్మ, ఇద్దరు కుమారులున్నారు.





ముస్లిం మతపెద్దల ప్రార్థన



చంద్రబాబునాయుడుకు వేద పండితుల ఆశీర్వాదం

చంద్రబాబు జన్మదిన వేడుకల్లో పాల్గొన్న దగ్గుబాటి

హ్యాపీ బర్త్‌డే బాబూ

శ్రేణులు, చిన్నారుల మధ్య టీడీపీ అధినేత పుట్టినరోజు



చంద్రబాబుకు బొకే ఇస్తున్న బండారు శ్రావణిశ్రీ





చంద్రబాబుకు మామిడి పళ్లు ఇస్తున్న కాలవ



బాబుతో విశ్రాంత ఐపీఎస్ అధికారి కుంటిమద్ది లక్ష్మీనారాయణ



చిన్నారికి కేక్ తినిపిస్తున్న చంద్రబాబు



శుభాకాంక్షలు తెలుపుతున్న పరిటాల సునీత



శుభాకాంక్షలు తెలుపుతున్న ఎంఎస్ రాజు

ఎన్నికల ప్రచార హడావుడిలో ఉన్న టీడీపీ అధినేత చంద్రబాబు.. తన పుట్టిన రోజు వేడుకలను పార్టీ నాయకులు, శ్రేణులు, చిన్నారుల నడుమ సంతోషంగా జరుపుకున్నారు. ప్రజాగళం సభ కోసం శుక్రవారం రాయదుర్గం నియోజకవర్గ పర్యటనకు వచ్చిన ఆయన.. కణేకల్లులో శుక్రవారం రాత్రి బస చేశారు. పార్టీ అభ్యర్థి కాలవ శ్రీనివాసులు ఆధ్వర్యంలో శనివారం ఉదయం చంద్రబాబు చేత కేక్ కట్ చేయించారు. పలువురు చిన్నారుల మధ్య చంద్రబాబు కేక్ కట్ చేసి.. వారికి తినిపించారు. అంతకు ముందు సర్వమత ప్రార్థనలను నిర్వహించి, మత పెద్దలు చంద్రబాబును ఆశీర్వదించారు. అనంతపురం ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ, హిందూపురం ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారథి, అనంతపురం అర్బన్ అభ్యర్థి దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, శింగనమల అభ్యర్థి బండారు శ్రావణి, మడకశిర అభ్యర్థి సునీల్‌కుమార్, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, ఎంఎస్ రాజు, మడకశిర మాజీ ఎమ్మెల్యే ఈరన్న తదితరులు ఆయనకు పుష్పగుచ్ఛాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.


- రాయదుర్గం/కణేకల్లు



టీడీపీ శ్రేణులకు అభివాదం చేస్తున్న చంద్రబాబునాయుడు

అభివృద్ధి ప్రణాళిక ఆవిష్కరణ

రాయదుర్గం, ఏప్రిల్ 20: రాయదుర్గం నియోజకవర్గ అభివృద్ధి ప్రణాళికను పార్టీ అభ్యర్థి కాలవ శ్రీనివాసులుతో కలిసి టీడీపీ అధినేత చంద్రబాబు కణేకల్లులో శనివారం ఆవిష్కరించారు. భైరవాన్‌తిప్ప ప్రాజెక్టుకు కృష్ణాజలాలు, ఉంతకల్లు రిజర్వాయర్ నిర్మాణం తదితర అంశాలకు సంబంధించిన 12 పేజీల బ్రోచర్‌ను వారు విడుదల చేశారు. ఐదేళ్ల జగన్ పాలనలో బాధితులు, ప్రజలకు అండగా చేసిన పోరాటాలు, టీడీపీ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులను అర్థంతరంగా ఆపేసిన వైనం గురించి కూడా అందులో ప్రస్తావించారు. ఈ ఎన్నికల్లో గెలిచిన అనంతరం నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి చేస్తామో కూడా అందులో వివరించారు.



అభివృద్ధి ప్రణాళికను ఆవిష్కరిస్తున్న చంద్రబాబు నాయుడు, కాలవ శ్రీనివాసులు

అభ్యర్థుల లెక్కాచారాలు ఇవే..

ఉమ్మడి జిల్లాలో ఎమ్మెల్యే అభ్యర్థులుగా పోటీ చేస్తున్న వారు నామినేషన్లు సమర్పిస్తున్నారు. దీనికి జతగా అఫిడవిట్ పొందుపరుస్తున్నారు. ఇందులో తమ గురించి పూర్తి సమాచారం అంటే విద్యార్హత, ఆస్తులు, కేసులు వంటివాటి గురించి రిటర్నింగ్ అధికారులకు ఇస్తున్నారు. అవి నియోజకవర్గాల వారిగా ఇలా ఉన్నాయి.

నియోజకవర్గం: ధర్మవరం

పేరు: కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి
పార్టీ: వైఎస్ఆర్ కాంగ్రెస్
భార్య పేరు: సుప్రియ
విద్యార్హత: బీ.ఈ
స్థిరాస్తులు: రూ.50,43,400
చరాస్తులు: రూ.4,24,89,880
నగదు: రూ.10.52లక్షలు
వాహనం విలువ: రూ.12.85లక్షలు
బంగారం: 215 తులాలు
అప్పులు: 1,59,65,481
కేసులు: 0

నియోజకవర్గం: ఉరవకొండ

పేరు: ప్రణయ్‌కుమార్‌రెడ్డి
పార్టీ: వైఎస్ఆర్ కాంగ్రెస్
విద్యార్హత: బీటెక్(డిస్‌కంటిన్యూ)
కేసులు: 2 క్రిమినల్ కేసులు
చరాస్తుల విలువ: రూ.1.12కోట్లు
స్థిరాస్తి విలువ: రూ.1.03కోట్లు
అప్పులు: రూ.12.35లక్షలు
బంగారం: లేదు

పేరు: పయ్యావుల కేశవ్
పార్టీ: తెలుగుదేశం
విద్యార్హత: పీజీ
కేసులు: 1 క్రిమినల్ కేసు
చరాస్తులు: రూ.3.21 కోట్లు
స్థిరాస్తి: రూ.1.75 కోట్లు
అప్పులు: రూ.3.35 కోట్లు
బంగారం: లేదు

పేరు: వై.మధుసూదన్‌రెడ్డి
పార్టీ: కాంగ్రెస్
విద్యార్హత: డిగ్రీ (బీకాం)
కేసులు: 3 క్రిమినల్ కేసులు
చరాస్తులు: రూ.8.07లక్షలు
స్థిరాస్తి: రూ.81.30లక్షలు
బంగారం: లేదు
అప్పులు: రూ.21.54లక్షలు

నియోజకవర్గం: గుంతకల్లు

పేరు: వై. వెంకట్రామిరెడ్డి
పార్టీ: వైఎస్ఆర్ కాంగ్రెస్
విద్యార్హత: బీకాం
కేసులు: 4
చరాస్తులు: రూ. 2.20 కోట్లు
స్థిరాస్తి: రూ. 2.28 కోట్లు
బంగారం: 1350 గ్రా.

పేరు: కమర్‌బేగం
పార్టీ: ఇండిపెండెంట్
విద్యార్హత: ఎల్ఎల్‌బీ
కేసులు: లేవు
చరాస్తులు: రూ.36 లక్షలు
స్థిరాస్తులు: రూ.4.20 కోట్లు
బంగారం: 200 గ్రా.

నియోజకవర్గం: రాప్తాడు

పేరు: పరిటాల శ్రీరామ్
పార్టీ : తెలుగుదేశం
విద్యార్హత: డిప్లొమా ఇన్ ఇంటర్‌నేషనల్ బిజినెస్
కేసులు: 22
స్థిరాస్తి: రూ.6.03 కోట్లు
చరాస్తి: రూ. 1.42 కోట్లు
అప్పులు: 16.86 లక్షలు
భార్య: పరిటాల జ్ఞాన పేరు మీద
స్థిరాస్తి: రూ. 44.28 లక్షలు
చరాస్తి: రూ. 31.04 లక్షలు
పేరు: పరిటాల సునీత
పార్టీ : తెలుగుదేశం
నియోజకవర్గం: రాప్తాడు
విద్యార్హత: పదో తరగతి
కేసులు: 9
స్థిరాస్తి: రూ. 28.53 కోట్లు
చరాస్తి: రూ. 1.12 కోట్లు
అప్పులు: 31.68 లక్షలు



మూడో రోజు 23 నామినేషన్లు

● రెండు ఎంపీ స్థానాలకు 5 ● 14 అసెంబ్లీ స్థానాలకు 18 ● రాప్తాడులో పరిటాల సునీత, శ్రీరామ్ నామినేషన్

అనంతపురం టౌన్/పుట్టపర్తి, ఏప్రిల్ 20: ఉమ్మడి జిల్లాలో సార్వత్రిక ఎన్నికలకు మూడో రోజు శనివారం 23 నామినేషన్లు దాఖలయ్యాయి. హిందూపురం ఎంపీ స్థానానికి నాలుగు, అనంతపురం ఎంపీ స్థానానికి ఒక నామినేషన్ దాఖలైంది. 14 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 18 నామినేషన్లు దాఖలయ్యాయి.

● కడప జిల్లా బద్వేలుకు చెందిన ఓ.శ్రీనివాసరాజు భారతీయ పంచాయతీ పార్టీ తరపున నామినేషన్ దాఖలు చేశారు. హిందూపురం ఎంపీ స్థానానికి టీడీపీ అభ్యర్థి బీకే పార్థసారథి తరుపున ఆయన భార్య కమలమ్మ రెండు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థిగా కుళ్ళాయప్ప, బీఎస్పీ తరుపున నాగరాజు నామినేషన్ వేశారు.

● అనంతపురం జిల్లా రాప్తాడు అసెంబ్లీ స్థానానికి టీడీపీ తరపున పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్, ఇండిపెండింట్‌గా రఘురామయ్య నామినేషన్ వేశారు. గుంతకల్లులో ఇండిపెండింట్ అభ్యర్థి ఖమార్ బేగం నామినేషన్ వేశారు. ఉరవకొండలో వైసీపీ తరపున ప్రణయ్ రెడ్డి పేరిట ఆ పార్టీ నాయకులు నామినేషన్ దాఖలు చేశారు. కళ్యాణదుర్గంలో బీఎస్పీ తరఫున హరిజన నాగమ్మ నామినేషన్ వేశారు. తాడిపత్రిలో ఇండిపెండెంట్‌గా రుషింగప్ప, శింగనమలలో వైసీపీ అభ్యర్థి వీరాంజినేయులు నామినేషన్ దాఖలు చేశారు.

● శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ అసెంబ్లీ స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థిగా పుల్రోళ్ళ నరసింహప్ప, ధర్మవరం స్థానానికి స్వతంత్ర అభ్యర్థిగా దాసరి కవిత నామినేషన్ వేశారు. కదిరిలో వైసీపీ తరఫున సయ్యద్ మహమ్మద్ అఖిల్, బీఎస్పీ తరపున రామచంద్ర నామినేషన్ వేశారు. మడకశిరలో టీడీపీ అభ్యర్థి సునీల్‌కుమార్, బీఎస్పీ అభ్యర్థి ఇందీవర్, హిందూపురంలో ఎస్‌యూసీఐ తరఫున రవీంద్ర, స్వతంత్ర అభ్యర్థిగా మహమ్మద్ గౌస్ నామినేషన్లు వేశారు.



నామినేషన్ పత్రం ఆర్‌ఓకు అందిస్తున్న పరిటాల సునీత, శ్రీరామ్





జేసీ అశ్మిత్‌రెడ్డి తరపున నామినేషన్ పత్రాలను అందజేస్తున్న టీడీపీ నాయకులు

నువ్వే సూసుకోల్ల సామీ..!

■ రాజకీయ నాయకులకు మస్తానయ్య దర్గా సెంటిమెంట్



మస్తాన్ వలి స్వామి సమాధి

గుంతకల్లుటౌన్, ఏప్రిల్ 20: గుంతకల్లు నియోజకవర్గం శాసనసభ ఎన్నికల్లో అభ్యర్థులు నామినేషన్ వేసేముందు మస్తానయ్యస్వామి దర్గాలో పూజలు చేయడం సెంటిమెంట్‌గా మారింది. పాతగుంతకల్లులో వెలసిన సయ్యద్ హజరత్ మస్తాన్‌వలి దర్గాకు 400 సంవత్సరాల చరిత్ర ఉంది. ఎమ్మెల్యే అభ్యర్థులు బీఫారంను దర్గాలో ఉంచి ప్రార్థనలు చేసిన తరువాత భారీ ఎత్తున ర్యాలీగా వెళ్లి నామినేషన్‌లు దాఖలు చేస్తారు. పార్టీలు ఏవైనా తమ కార్యక్రమాలు దర్గా నుంచి ప్రారంభిస్తే సక్సెస్ అవుతాయనే నమ్మకం ఉంది.

ప్రారంభించారు... వదిలేశారు..!

గ్రామంలో అపరిశుభ్రత లేకుండా చేస్తానని హామీ ఇచ్చి, పనులు ప్రారంభించి, మధ్యలో వదిలేయడంపై శింగనమల ప్రజలు ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శింగనమలకు అండర్ డ్రైనేజ్ వ్యవస్థ తీసుకొచ్చి అపరిశుభ్రత లేకుండా చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈపనులను రూ.1.5 కోట్లతో 2020 ఫిబ్రవరి2న ప్రారంభించారు. అయితే ఆపనులను కేవలం 25 శాతం చేసి వదిలేశారు. దాంతో గ్రామంలో ఏ వీధులో చూసినా మురుగునీరే దర్శనమిస్తోంది. ఈక్రమంలో దోమలు పెరిగి, గ్రామంలో డెంగీ జ్వరాలు ప్రబలుతున్నాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- శింగనమల



శింగనమలలో అండర్ డ్రైనేజీ పనుల శిలాఫలకం

అధ్వానపాలనకు టింకరింగ్ చేస్తా..!

సమస్యలపై మండిపడిన సామాన్యుడు

అతనేమి రాజకీయ నాయకుడు కాదు. ధనవంతుడు అసలే కాదు. పదవిపై మోజు కూడా లేదు. అతడు కార్లకు టింకరింగ్ చేసుకునే సామాన్యుడు. కానీ తను ఎదుర్కొన్న సమస్యలు, తన చుట్టూ ఉన్న పరిస్థితులు అతని కడుపు మండించాయి. అందుకే రాజ్యాధికారముంటునే వీటన్నింటిని ఎదుర్కొగలననే ఆలోచనను రేకెత్తించాయి. ఈక్రమంలోనే ఆయన హిందూపురం అసెంబ్లీ స్థానానికి స్వతంత్ర అభ్యర్థిగా శనివారం నామినేషన్ వేశాడు. ఆయనే హిందూపురంలో కార్ల టింకరింగ్ చేసే మహ్మద్. తాను నామినేషన్ వేయడానికి కారణాలు ఉన్నాయని ఆయన తెలిపారు. ఒక మారు అనారోగ్యంతో ప్రభుత్వ ఆసుపత్రికి వెళితే సరిగా చికిత్స చేయకుండా తనతో దురుసుగా ప్రవర్తించడం బాధించిందన్నారు. అలాగే హిందూపురంలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, ఇటీవల రైల్వే రోడ్డు వెడల్పులో భాగంగా భవనాలు పగులగొట్టి అలానే వదిలేశారని, పట్టణానికి రింగ్‌రోడ్డు లేదని, పెద్ద వాహనాలు వస్తే ఇబ్బంది కలుగుతుందని ఇలాంటి సమస్యలు పరిష్కారం కోసమే ఎన్నికల బరిలో నిలిచానన్నారు. ఇవే ప్రధాన ప్రచారాంశాలుగా ప్రజల్లోకి వెళ్తానని 'ఆంధ్రజ్యోతి'తో తెలిపాడు.

- హిందూపురం అర్బన్



నామినేషన్ దాఖలు చేస్తున్న మహ్మద్

టీడీపీలో చేరిన మాజీ ఎమ్మెల్యే గుత్తా



టీడీపీ నాయకులు బండారు శ్రావణిశ్రీ, ఆలం, కేశవరెడ్డిలతో మాజీ ఎమ్మెల్యే గుత్తా వెంకటనాయుడు , సాకే రామకృష్ణ

బుక్కరాయసముద్రం, ఏప్రిల్ 20: శింగనమల నియోజకవర్గంలో వైసీపీకి భారీ షాక్ తగలింది. ధర్మవరం మాజీ ఎమ్మెల్యే గుత్తా వెంకటనాయుడు, వైసీపీ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ సాకే రామకృష్ణ శనివారం చంద్రబాబునాయుడు సమక్షంలో టీడీపీలో చేరారు. 2014 ఎన్నికల అనంతరం గుత్తా వెంకటనాయుడు టీడీపీలో స్తబ్ధుగా ఉండిపోయాడు. 2019 ఎన్నికల సమయంలో వైసీపీ అభ్యర్థి జొన్నలగడ్డ పద్మావతి తరఫున పుట్లూరు మండలంలో ప్రచారం చేపట్టారు. అనంతరం కాలంలో వైసీపీ విధానాలు నచ్చక తిరిగి సొంతగూటికి చేరినట్లు వెల్లడించారు. బుక్కరాయసముద్రం మండలానికి చెందిన సాకే రామకృష్ణ వైసీపీలో ఎస్సీ, ఎస్టీలకు గుర్తింపు లేదని, కేవలం ఓ సామాజిక వర్గానికే పెద్దపీట వేస్తున్నారని ఆరోపించారు. టీడీపీతోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందనే ఆ పార్టీలోకి చేరినట్లు తెలిపారు.



చంద్రబాబునాయుడు సమక్షంలో టీడీపీ కండువా వేసుకుంటున్న వైసీపీ జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు సాకే రామకృష్ణ

వ్యయ పర్యవేక్షణ టీంల మధ్య సమన్వయం అవసరం

అనంతపురం టౌన్, ఏప్రిల్ 20: అభ్యర్థులు, పార్టీల ఖర్చుల పరిశీలనకు ఏర్పాటు చేసిన కమిటీల మధ్య సమన్వయం ఉండాలని కేంద్ర ఎన్నికల వ్యయ పరిశీలకులు విలాస్ షిండే సూచించారు. శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. ప్రతి టీమ్ తమకు కేటాయించిన బాధ్యతలను పక్కాగా పాటించాలన్నారు. ఎట్టి పరిస్థితిల్లోను కమిషన్ నిబంధనలను ఉల్లంఘించరాదన్నారు. మీరు ఇచ్చే ప్రతి రిపోర్టు పారదర్శకంగా ఉండాలని, అందులో ఏ పొరపాటు ఉన్నా చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో కేంద్ర వ్యయ పరిశీలకులు రందాస్ టీ. కాలే, నితిన్ అగర్వాల్, కలెక్టరు వినోద్‌కుమార్, టీమ్ సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న కేంద్ర ఎన్నికల వ్యయ పరిశీలకుడు విలాస్ షిండే, కలెక్టర్

ఆ రోజుల్లో...



ఓటరు దేవుడయ్యే సమయం వచ్చింది. స్వతంత్ర భారతావనిలో ఎన్నికల సమరం మొదలైన నాటి నుంచి నేటి దాకా అనేక చిత్రవిచిత్రాలు చోటు చేసుకుంటూనే ఉన్నాయి. అభ్యర్థుల ప్రచార సరళి, ఓటింగ్ విధానంలో అనేక మార్పులు వచ్చాయి. గతంలో గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ఓటు వేసేవాళ్లమని, ప్రజల విరాళాలతో అభ్యర్థుల తరపున ప్రచారం చేసేవాళ్లమని పలువురు వృద్ధ ఓటర్లు తమ జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అప్పటి సంఘటనల అనుభవాలను 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్నారు.

నచ్చిన వ్యక్తికి ప్రచారం చేసేవాళ్లం



నేను యుక్తవయసులో ఉండగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికల నిర్వహణ ప్రక్రియ ప్రారంభమైంది. అప్పుడు ఎన్నికల్లో మాకు నచ్చిన వ్యక్తి కోసం ప్రచారానికి కూడా వెళ్లేవాళ్లం. అభ్యర్థులు వాహనాల డీజిల్, భోజనాల ఖర్చులు కూడా పెట్టుకోలేని స్థితిలో ఉండే వాళ్లు. అందుకే మంచోళ్లకు ప్రజలే విరాళాలిచ్చి గెలి పించేవాళ్లు. ఇప్పుడు ఎన్నికలు బాగా ఖరీదుగా మారాయి. ఎన్నికల ప్రచారానికి కూడా రోజువారి కూలీలను పెట్టుకుంటున్నా రట. నిజంగా మన గ్రామ అభివృద్ధి కోరుకునేవారు ఎవరైనా సరే డబ్బులు తీసుకోకుండా ఓటు వేయాలి. నిజాయతీపరున్ని గెలిపించుకోవాలి.

- నిచ్చెనమెట్ల పుల్లయ్య, తాడిమర్రి

రెండు మైళ్ల దూరం వెళ్లేవాళ్లం



ఓటేసేకి మా ఊరి నుంచి రెండు మైళ్ల దూరంలో ఉండే ఊరికి ఎద్దులబండిలో వెళ్లేవాళ్లం. ఎన్నికలు వచ్చిన ప్రతిసారి ఓటేశాం. ఉప్పునేసినపల్లి పంచాయతీ కింద మా ఊరు ఉంది. అప్పట్లో నేను నా భర్త రామప్పతో కలిసి ఉప్పునేసినపల్లికి వెళ్లి ఓట్లువేసేవాళ్లం. అక్కడ పార్టీల వాళ్ల ఉదయం ఉగ్గాని వడ పెట్టెవాళ్లు. ఓటువేసి ఆ టిఫిన్ తిని తిరిగివచ్చేవాళ్లం. 2014నుంచి మా గ్రామంలోనే ఓటు వేసుకునేందుకు అవకాశం వచ్చింది.

- రామలక్ష్మమ్మ, గరుడంపల్లి గ్రామం, ధర్మవరం రూరల్

రైతులే ఎడ్ల బండ్లు ఏర్పాటు చేసేవారు



మాది శింగనమల మండలంలోని గురుగుంట్ల గ్రామం. యాభై ఏళ్ల కిందట పంచాయతీ కేంద్రంలో ఓటు వేసేవారు. పంచాయతీ పరిధిలో నాలుగైదు గ్రామాలు ఉండేవి. ఓటర్లు పంచాయతీ కేంద్రంలో ఓటు వేయడానికి వెళ్లేందుకు రైతులు ఎద్లు బండ్లు పంపేవారు. నాకు ఓటు హక్కు వచ్చిన సంవత్సరం ఎన్నికలు జరిగాయి. అప్పుడు మంచి వ్యక్తికి ఓటు వేయాలనే భావన ఉండేది. ఓటు వేయడానికి పక్క గ్రామానికి వెళ్లేవాళ్లం. ఉదయమే ఓటు వేయడానికి వెళ్లే వాళ్లం. అక్కడ పార్టీల నాయకులు ఏర్పాటు చేసిన ఉగ్గాని తిని కాఫీ తాగి ఓటు వేసి వచ్చేవాళ్లం. ఇప్పటి మాదిరి డబ్బులు పంపిణీ ఉండేది కాదు. మా ఇళ్లలో పెద్దలు చెప్పిన గుర్తులకు ఓటు వేసేవాళ్లం.

దైవయత్నం, ఆర్టీసీ రిటైర్డ్ కండక్టర్, గురుగుంట్ల, శింగనమల మండలం

ఉగ్గాని పెడితే చాలు..



ఇప్పుడు ఓటేయడానికి రావాలంటే కొందరికి మందు, బిర్యాని, దుడ్లు ఇస్తున్నారు. మాకాలంలో బొరుగుల ఉగ్గాని పెడితే చాలనుకునేవాళ్లం. నాకు ఓటు హక్కు వచ్చినప్పటి నుంచి ఇరవై ఏళ్ల వరకూ ఎన్నికలు వచ్చాయంటే చాలు గ్రామంలో ఒక చోట అభ్యర్థులు ఉదయమే బొరుగుల ఉగ్గాని కలిపించేవారు. ఆ పార్టీకి, ఆ వ్యక్తికి సానూభూతిపరులు, తటస్థంగా ఉన్న వారు మాత్రం ఈ ఉగ్గాని తీసేకి వచ్చేవారు. ప్రతిపక్ష సానుభూతిపరులు వచ్చేవారు కాదు. వాళ్ల శిబిరం వేరుగా ఉండేది. ఎన్నికలు వారం ముందు నుంచే ఊర్లో ఫలానా చోట ఉగ్గాని చేస్తామని ప్రచారం చేసేవాళ్లం. రాను రాను ఉగ్గాని కనుమరుగై పోయాయి. అందరూ కలిసి మాట్లాడుకున్న తర్వాత గ్రామ అభివృద్ధికి సహకారం అందిస్తాడని భావించిన వ్యక్తికే ఓటు వేసేవాళ్లం.

- నారాయణరెడ్డి, సలకం చెరువు, శింగనమల మండలం

తస్మదీయులకే తంటాలు..!

వైసీపీ వర్గీయులైతే అంతా ఓకే

ఆరోపణలున్నా తూతూమంత్రంగా విచారణ

ప్రశ్నించేవారిపై సస్పెన్షన్ వేటు

రాష్ట్ర ప్రభుత్వ తీరుపై టీచర్ల ఆగ్రహం

అనంతపురం విద్య, ఏప్రిల్ 20: మన వాళ్లయితే వదిలేద్దాం. పరాయి వారైతే వేటేద్దాం అనేలా వైసీపీ పాలన సాగుతోంది. వైసీపీ అనుబంధ ఉపాధ్యా య సంఘాల నాయకులు, ఆ పార్టీకి కొమ్ముకాసే ఉపాధ్యాయ సంఘం టీచర్లు ఏం చేసినా చర్యలు తీసుకోరు. ఇతర సంఘాల నాయకులు తమ సమస్యలపై ప్రశ్నించినా వేటాడుతారు..చ ర్యలు తీసుకుంటారు. ఈ పక్షపాత వైఖరిపై తీవ్ర విమర్శలు వస్తు న్నాయి. అయితే సమస్యలపై గళం విప్పిన సంఘాల నాయకులైన ఇద్దరు టీచర్లను శనివారం సస్పెండ్ చేయడం అనేక విమర్శలకు తావి స్తోంది.



దీఈఓ ఆఫీస్ (ఫైల్)

చర్యలు తీసుకోకుండా ఒత్తిళ్లు

అనంతపురం నగర శివారులోని ఓ డాబాలో వైసీపీకి అను బంధంగా నడిచే ఉపాధ్యాయ సంఘం, అనుకూలంగా నడిచే మరో ఉపాధ్యాయ సంఘం నాయకులు గతనెలలో ఆదివారం రాత్రి రాజకీయ విందు చేసుకున్నారు. భారీ ఎత్తున టీచర్లు, సంఘాల నాయకులు, హెచ్‌ఎంలు, పీడీలు తదితరులు హాజర య్యారు. వైసీపీకి లబ్ధిచేకూర్చా లన్న ఉద్దేశంతోనే అందరూ కలిశారు. దీనికి వైసీపీ ఎమ్మెల్యే కూడా హాజరయ్యారు. ఈ పొలిటికల్ డిన్నర్‌పై 'ఆంధ్రజ్యోతి'లో కథనాలు వచ్చాయి. ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించగా తూతూ మంత్రంగా చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వారిపై చర్యలు తీసు కోకుండా కొందరు వైసీపీ ప్రజాప్రతినిధులు సైతం అధికారులపై ఒత్తిళ్లు తీసుకొచ్చినట్టు సమాచారం.

సమస్యలు పరిష్కరించాలని అడగటం నేరమా..?

జగన్ ప్రభుత్వం తమను వేధిస్తోందని పలువురు ఉపాధ్యా యులు వాపోతున్నారు. ఇష్టమొచ్చిన తేదీల్లో జీతాలు వేయడం, 117 జీవో తీసుకొచ్చి ప్రాథమిక పాఠశాలలను విచ్ఛిన్నం చేయడం, అసంబద్ధ నిర్ణయాలు తీసుకోవడం, సీపీఎస్ రద్దు చేయకపోవడం వంటి సమస్య లను ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్నారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులతోపాటు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు తమ సమ స్యలు పరిష్కరించాలని అనేకమార్లు ప్రభుత్వాన్ని కోరారు. అయితే ఇదే నేరమన్నట్లుగా ఇద్దరు టీచర్లను అధికారులు సస్పెండ్ చేయడం విమర్శ లకు తావిస్తోంది. ఏ పార్టీకి లబ్ధి చేకూర్చేలా ప్రచారం చేయకపోయినా సంఘాల నాయకులు, టీచర్లు అయిన విజయభాస్కర్, హరికృష్ణను విద్యాశాఖ అధికారులు సస్పెండ్ చేయడంపై విమర్శలు వస్తున్నాయి.

ఆ మీటింగ్‌ను దెబ్బకొట్టడానికేనా..?

ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం(ఏపీజీఈఏ), ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ సంఘాల ఐక్యవేదిక చైతన్య సదస్సు ఆది వారం జరగనుంది. సదస్సును అనంతపురం నగరంలోని జేఎన్‌టీయూ రోడ్డులోని ఆర్‌జేసీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్నారు. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణ ఈ సదస్సుకు హాజరవుతున్నారు. సుమారు 20 నుంచి 30 సంఘాలకు చెందిన ఉద్యోగులు, టీచర్లు, పెన్ష నర్లు వేలాది మంది హాజరయ్యే అవకాశం ఉంది. ఈ ఐక్యవేదిక రాష్ట్ర కో చైర్మన్‌గా హరికృష్ణ వ్యవహరిస్తున్నారు. ఈ సదస్సు నిర్వహణలో క్రియా శీలకంగా ఉన్నారు. దీంతో హరికృష్ణపై సస్పెన్షన్ వేటు వేస్తే... ఇతర టీచర్లు కూడా సదస్సుకు హాజరుకావడానికి వెనుకడుగు వేస్తారన్న కోణంలో కూడా సస్పెన్షన్ వేటు వేసినట్టు చర్చ నడుస్తోంది. ఆయనతో పాటు, విజయ్‌భాస్కర్‌పై సైతం సస్పెన్షన్ వేటు వేయడం ఉపాధ్యాయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. అయితే బహిరంగంగా రాజకీయ విందు చేసుకున్న వైసీపీ అనుబంధ ఉపాధ్యాయ సంఘాల నేతలు, టీచ ర్లపై చర్యలు తీసుకోకుండా తప్పించే యత్నాలపై టీచర్లు భగ్గుమంటు న్నారు. ఇదెక్కడి అన్యాయమంటూ తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు



నామినేషన్ రోజు వేషధారణతో మారుతిప్రసాద్

వేషంతో జోష్

ఎన్నికలు వచ్చాయంటే చాలు..! ఆయనలో ఉన్న కళాకారుడు నిద్ర లేస్తాడు. టీడీపీ అభ్యర్థి నామినేషన్ వేసిన సందర్భంగా ప్రతి ఎన్నికలోనూ ఓ వేషంతో ర్యాలీలో పాల్గొంటాడు. ప్రత్యేక ఆకర్షణగా ఊరేగింపులో ముందు భాగాన నడుస్తూ తన హావభావాలతో కార్యకర్తల్లో జోష్ పెంచుతాడు. ఈ అలవాటు ఆయనకు చిన్నతనం నుంచే ఉన్నట్లు తెలిపాడు. ఆయనే లేపాక్షి మండలానికి చెందిన టీడీపీ నాయకుడు మారుతీప్రసాద్. 2014 ఎన్నికల సమయంలో శ్రీకృష్ణదేవరాయలు వేషం ధరించి ర్యాలీలో పాల్గొన్నాడు. 2019లో బాలకృష్ణ నటించిన లెజెండ్ సినిమాలోని హీరో వేషధారణతో గుర్రంపై స్వారీ చేశాడు. ఈ ఏడాది కూడా శ్రీకృష్ణదేవరాయల వేషంతో గుర్రంపై ఊరేగింపులో పాల్గొన్నాడు. గుర్రాన్ని అనంతపురం నుంచి తెప్పించి మరో ఇద్దరితో వేషధారణ వేయించి ర్యాలీలో అందరినీ ఆకట్టుకున్నారు.

- హిందూపురం

బీకేఎస్‌లో గ్రామ వలంటీర్లు రాజీనామా చేస్తున్న దృశ్యం



రాజీనామా చేస్తే పది వేలు..!

గ్రామ వలంటీర్లపై వైసీపీ ఒత్తిడి

బుక్కరాయసముద్రం, ఏప్రిల్ 20

శింగనమల నియోజకవర్గంలో వైసీపీ నాయకుల ఒత్తిడితో గ్రామ వలంటీర్ల రాజీనామాలు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఆరు మండలాల్లో 600 మందికిపైగా వలంటీర్లు రాజీనామాలు చేసేందుకు సిద్ధం అయినట్లు తెలిసింది. ఇప్పటికే వందమందికి పైగా రాజీనామా చేశారు. వైసీపీ గృహ కన్వీనర్లు గ్రామ వలంటీర్లుతో రహస్య సమావేశాలు పెట్టి ఈ ఎన్నికలలో వైసీపీ తరపున పని చేయండి ఒక్కొక్కరికి రూ.10వేలు ఇస్తామని ప్రకటిస్తున్నారు. ఎన్నికలలో గెలుపొందిన అనంతరం మీకే పోస్టులు వస్తాయని, వీటితో పాటు వేతనం రూ.పదివేలు వస్తుందని ప్రలోభ పెడుతున్నట్లు సమాచారం. నియోజకవర్గంలో 1400 మందికి పైగా వలంటీర్లు ఉండగా అందరూ రాజీనామా చేయాలని ఒత్తిడి తెస్తున్నారు. ప్రస్తుతం ఎన్నికల ప్రచారంలో వలంటీర్లు పాల్గొంటే ఎన్నికల కమిషన్ వేటు వేస్తుండంతో రాజీనామా తెరపైకి తెచ్చినట్లు స్పష్టమతోంది.



వీధుల్లో ప్రవహిస్తోంది. ఎప్పుడూ గ్రామంలోని నేలంతా చిత్తడిగా ఉండటంతో విషపురుగుల సంచారం ఉందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తు న్నారు. టీడీపీ పాలనలో ఎమ్మెల్యే పయ్యా వుల కేశవ్ చొరవ తీసుకుని ఆర్ అండ్‌ఆర్ (పరిహారం పునరావాసం) కింద రూ.55 కోట్లు మంజూరు చేయించారు. సర్వేలు నిర్వహించి, నివేదికలు సిద్ధమవుతున్న తరుణంలో ఎన్నికలు వచ్చాయి. దీంతో ఆ ప్రక్రియ కార్యరూపం దాల్చలేదు. 2019 ఎన్నికల సమయంలో ఉరవకొండ వైసీపీ అభ్యర్థి విశ్వేశ్వరరెడ్డి కుమారుడు ప్రణయ్‌రెడ్డి స్థానిక ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ప్రచారం చేస్తూ తమ పార్టీ అధికా రంలోకి రాగానే మూడు నెలల్లో సమస్య పరిష్కరిస్తానని స్వామి మీద ప్రమాణం చేశారు. పార్టీ అధికారంలోకి వచ్చి ఏళ్లు గడిచినా హామీ మాత్రం నెరవేరలేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మీకు ఓటు ఎందుకెయ్యాల్ల ?

జీడిపల్లి గ్రామస్థులు

బెళుగుప్ప, ఏప్రిల్ 20: 'ఊటనీటిముప్పు సమస్యను అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లో పరిష్కరిస్తామ న్నారు. ఇన్నాళ్లైనా పట్టించుకోలేదు. ఇప్పుడు ఓట్లడిగేకి వస్తాండారు. మీకెందుకు ఓటెయ్యాల్ల' అని వైసీపీ నాయకు లను మండలంలోని జీడిపల్లి గ్రామస్థులు నిలదీస్తున్నారు. రిజర్వాయరుకు దిగువనే గ్రామం ఉండటంతో ఊటనీరు

గుడి ముందు ప్రమాణం చేసి మోసపుచ్చడం దారుణం



మూడు నెలల్లోగా ఊట నీటి సమస్య పరిష్కరిస్తామని ఆంజనేయస్వామి గుడి ముందు ప్రమాణం చే శారు. ఏళ్ల గడిచినా పట్టించు కోకపోవడం దారు ణం. ఇలాంటి మోసపూరిత పార్టీకి ఎందుకు ఓటెయ్యాలి.

- దామోదర, జీడిపల్లి

ఉత్తుత్తి హామీలిచ్చేవారికి ఓటెందుకు వేయాలి



ఉత్తుత్తి హామీలిచ్చే వైసీపీ నా యకులకు ఓటెందుకు వేయా లి. అన్ని వసతులతో పునరా వాస చర్యలు చేపట్టేందుకు ఎమ్మె ల్యే పయ్యావుల కేశవ్ మంజూరు చేయించిన పథకాన్ని పక్కన పెట్టి, తాము తీరుస్తా మంటూ హామీ లిచ్చి మరిచారు. వీరెందుకు మాకు.

- వెంకటనాయుడు, గ్రామ సర్పంచ్, జీడిపల్లి

ఎస్సీ,ఎస్టీలను కూలీలుగా మార్చిన వైసీపీ

భూమి కొనుగోలు పథకానికి మంగళం

ఐదేళ్లలో ఒక్క ఎకరా కొనుగోలు చేయని దుస్థితి

టీడీపీ హయాంలో ఎస్సీలకు రూ. 23.31 కోట్లతో 799 ఎకరాలు

ఎస్టీలకు రూ. 62.72 లక్షలతో 49.44 ఎకరాల కొనుగోలు

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఏప్రిల్ 20 : 'నా ఎస్సీలు.. నా ఎస్టీలు.. వారి అభివృద్ధే నా ధ్యేయం... వారు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు శాయశక్తులా కృషి చేస్తా' అంటూ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి బహిరంగ సభల్లో అలవికాని ప్రేమ ఒలకబోస్తూ ఉంటారు. క్షేత్రస్థా యిలో పరిశీలిస్తే ఎస్సీ,ఎస్టీల అభివృద్ధి ఎక్కడ జరి గిందో... ఎలా జరిగిందో అర్థంకాని విధంగా మారింది. గ్రామీణ ప్రాంతాల్లోని పేద ఎస్సీ,ఎస్టీలు స్వయం ఉపాధితో ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే ఉద్దేశ్యంతో గత ప్రభు త్వాలు ల్యాండ్ పర్చే సింగ్ స్కీమ్‌ను ప్రవేశపె ట్టాయి. అందుకనుగుణంగా భూములను కేటాయిస్తూ వచ్చాయి. గత టీ డీపీ ప్రభుత్వం ఎస్సీ,



ఎస్సీ,ఎస్టీ కార్పొరేషన్ల సముదాయం పెన్నార్ భవన్

ఎస్టీల కోసం భూములు కొనుగోలు చేసి వారికందించింది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ స్కీమ్‌ను తొలగించి ఆ వర్గాల ప్రజల నోట్లో మట్టి కొట్టింది. వైసీపీ ఐ దేళ్ల పాలనలో ఒక్క ఎకరా కొనుగోలు చేయలేదంటే ఎస్సీ,ఎస్టీల పట్ల ప్రభుత్వా నికి ఏపాటి చిత్తశుద్ధి ఉంటే అర్థమవుతోంది. ఎస్సీ,ఎస్టీ లు అగ్రవర్ణాల కిం ద కూలీలుగా ఉండాలనే దురుద్దేశ్యంతోనే తమను ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వం వ్యవసాయ కూలీలుగా మార్చిందని ఆ వర్గాలు మండిపడుతు న్నాయి.

> వైసీపీ ఐదేళ్ల పాలనలో ఎస్సీ,ఎస్టీలకు తీరని అన్యాయం జరిగింది. 27 పథకాలను రద్దు చేశారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను ఇవ్వ కుండా మోసం చేశారు. పేద ఎస్సీ విద్యార్థులకు బెస్ట్ అవె లబుల్ స్కూల్ స్కీంను ఎత్తేసి కార్పొరేట్ విద్యకు దూరం చేశారు. పేద ఎస్సీ,ఎస్టీ ప్రజల కోసం టీడీపీ ప్రభుత్వం ల్యాండ్ పర్చేసింగ్ స్కీమ్ కింద ఎంతో మంది పేద ఎస్సీ,
>
> **వైసీపీ హయాంలో అన్యాయం**
>
> ఎస్టీలకు భూములను ఉచితంగా కేటాయించింది. వైసీపీ వచ్చాక ఒక్క సెంటు భూమి కూడా ఇవ్వకుండా మోసం చేసింది. సీఎం జగన్‌రెడ్డి నా ఎస్సీ.. నా ఎస్టీ అంటూనే ఆ వర్గాలను అణచి వేతకు గురిచేశారు.
>
> **-లక్ష్మన్న, టీడీపీ ఎస్సీ సెల్ నాయకుడు, పి. నారాయణపురం, కూడేరు**

టీడీపీ హయాంలో భూముల పంపిణీ

2014 సంవత్సరంలో అప్పటి టీడీపీ ప్రభుత్వం జిల్లాలో భూములు లేక వ్యవసాయ కూలీలుగా ఉన్న ఎస్సీలకు ల్యాండ్ పర్చేసింగ్ స్కీమ్ కింద భూములు అందిం చాలని తలంచింది. ఇందుకోసం ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఒక బృందాన్ని ఏర్పాటు చేసి భూములు లేనినిరుపేద ఎస్సీల జాబితాను సిద్ధం చేసింది. కార్పొరేషన్ అధికా రులు అందించిన నివేదికల మేరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 317 మంది లబ్ధిదారులను ఎంపిక చేసింది. జిల్లాలో పలు ప్రాంతాల్లో 799.98 ఎకరాల భూమిని గుర్తించి కొనుగోలు చేసింది. ఆ భూముల కొనుగోలు కోసం రూ. 23.31 కోట్లను ఖర్చు చేసింది. ఎస్టీ వర్గాల్లో వ్యవసాయ భూములు లేని వారి కోసం ల్యాండ్ పర్చేసింగ్ స్కీమ్ కింద రూ. 62.72 లక్షల నిధులను విడుదల చేసింది. ఇందుకోసం జిల్లా వ్యాప్తంగా 22 మందిని ఎంపిక చేశారు. వారి కోసం దాదాపు 49.44 ఎకరాలను కొనుగోలు చేసి అప్పగించారు. ఎస్టీల కోసం వ్యవసాయానికి బోర్లు లేని వారిని 20 మందిని ఎంపిక చేసి డిగ్గింగ్ బోర్ వెల్స్ స్కీమ్ కింద 20 మంది లబ్ధిదారులకు రూ. 22.80 లక్షలు ఖర్చు చేసి బోర్లు వేయిం చింది. బోర్లు ఉండి విద్యుత్ సౌకర్యం లేని వారి కోసం ఎనర్జిసేషన్ ఆఫ్ ఎస్టీ బోర్ వెల్స్ పథకం కింద 690 మంది ఎస్టీ లబ్ధిదారులకు రూ. 6.62 కోట్లు ఖర్చుచేసి కరెంటు సౌకర్యాన్ని కల్పించింది. మొత్తం మీద ఎస్సీ,ఎస్టీ పేద ప్రజల కోసం అప్పటి టీడీపీ ప్రభుత్వం ఐదేళ్లలో రూ. 30 కోట్లకుపైగా ఖర్చు చేసింది.

భూములు పంచకపోగా... కబ్జాకు స్కెచ్...

టీడీపీ ప్రభుత్వంలో ఎస్సీ,ఎస్టీ వర్గాల కోసం భూములు కొనుగోలు చేసి అందిస్తే... వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో ఒక్క ఎకరా కొనుగోలు చేయకపోగా... గతంలో లబ్ధిదారులకు అందించిన భూములపై కన్నేసింది. వైసీపీకి చెందిన కొందరు ప్రజాప్రతినిధులు ఎస్సీ,ఎస్టీల చేతుల్లో ఉన్న భూములను కబ్జాకు స్కెచ్ చేశారు. ప్రధానంగా తాడిపత్రి పరసర ప్రాంతాలు యల్లనూరు, పుట్లూరుతో పాటుమరి కొన్ని ప్రాంతాల్లో దాదాపు 160 ఎకరాలకుపైగానే పలువురు రాజ కీయ నేతల కబంధ హస్తాల్లో చిక్కుకున్నట్లు తెలుస్తోంది. దీంతో లబ్ధిదారులు ఆ ప్రజాప్రతినిధుల వద్ద తీసుకున్న అప్పును తీర్చ లేక.. భూములను విడిపించుకోలేక సతమతమవుతున్నారు. ఇలా వైసీపీ ఐదేళ్ల పాలనలో ఎస్సీ,ఎస్టీ ప్రజలకు ఉన్న పథకాలను వర్తింపజేయకపోగా ఉన్నవాటిని లాగేసుకునే ప్రయత్నం చేయ డంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఎగిరే గువ్వలకు లక్షల గింజలు !

వైసీపీ కార్పొరేటర్లు పక్క చూపులు చూడకుండా తాయిళాలు

అనంత అర్బన్‌లో బలాన్ని బట్టి రూ. లక్షల చెల్లింపు



అనంతపురం క్రైం, ఏప్రిల్ 20: అనంతపురం అర్బన్ నియోజకవ ర్గంలో అధికార వైసీపీ తమ పార్టీ కార్పొరేటర్లకే డబ్బు పంచాల్సి వస్తోంది. కొందరు కార్పొరేటర్లు ఎన్నికల ప్రచారంలో పాల్గొనకుండా ఉండటంతో వారు టీడీపీ వైపు వెళ్తారేమోననే ఆందోళనతో అధికార పార్టీ తాయిళాలకు తెర తీసి నట్లు సమాచారం. ఈ క్రమంలోనే కార్పొరేటర్లకు వారి బలాన్ని బట్టి రూ.లకా రాలు ముట్టజెప్పినట్లు తెలిసింది. అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో 50 డివిజన్లు, నాలుగు గ్రామ పంచాయతీలున్నాయి. కూటమి ఎమ్మెల్యే అభ్యర్థిగా దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్, వైసీపీ అభ్యర్థిగా అనంతవెంకటరామిరెడ్డి పోటీ చేస్తున్నారు. ప్రధాన పోటీ ఈ ఇద్దరి మధ్యే ఉండనుంది.

ఒక్కొక్కరికి రూ.3 లక్షల నుంచి రూ.5లక్షలు...

ఎన్నికలు సమీపిస్తున్నా కొందరు కార్పొరేటర్లు సైలెంట్‌గా ఉండటం వైసీపీ అభ్యర్థికి గుబులు పుట్టించింది. దీంతో కొత్త ఓట్లు దేవుడెరుగు, ఉన్న ఓట్లు నిలుపుకుంటే చాలు అనుకునే పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలోనే కార్పొరేటర్లకు తాయిళాల పంపకం చేపట్టినట్లు తెలుస్తోంది. మూడేళ్ల కిందట జరిగిన మున్సినల్ ఎన్నికల్లో నగరపాలిక పరిధిలోని 50 డివిజన్లకు గాను 48మంది కార్పొరేటర్లు వైసీపీ తర పున గెలుపొందారు. వీరిలో అత్యధికులు కొత్తగా పోటీ చేసిన వారే. అనంత పురం అర్బన్‌లో ఇంకా కొన్ని వర్గాలు ఎమ్మెల్యే అభ్యర్థికి దూరంగానే ఉంటు న్నాయి. అదే క్రమంలో కొందరు కార్పొరేటర్లు సైతం ప్రచారానికి దూరంగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో కార్పొరేటర్లకు లెక్కల గాలం వేసినట్లు సమా చారం. ఒక్కో కార్పొరేటర్‌కు రూ.3లక్షల నుంచి రూ.5లక్షల వరకు అందజేసినట్లు తెలిసింది. నగరంలోని 30మంది కార్పొరేటర్లకు లెక్కలు అందినట్లు తెలుస్తోంది.

జంపింగ్ ఊహాగానాలతోనే....

ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో ఓ ప్రచారం ఊపందుకుంది. వైసీపీ నుంచి టీడీపీలోకి 15మంది వరకు కార్పొరేటర్లు వెళ్తారనే ప్రచారం జరిగింది. దీంతో ఆ గోడ దూకే కార్పొరేటర్లపై వైసీపీ నేతలు ఆరా తీసినట్లు తెలిసింది. రెండు వారాల కిందట కార్పొరేటర్లు హరిత, బాబా ఫక్రుద్దీన్‌లు టీడీపీలో చేరిన విషయం తెలిసిందే. దీంతో మరింత మంది జంప్ అయ్యే ప్రమాదముందని భావించిన వైసీపీ నేతలు దిద్దు బాటు చర్యలకు దిగారు. అందుకే ముడుపుల బేరం పెట్టినట్లు సమాచారం. అలా రూ.లకారాలు జేబుల్లోకి నింపుకున్న కార్పొరేటర్లు వైసీపీ అభ్యర్థి ప్రచారంలో సందడి చేస్తున్నారట.

దోస్త్ మేరా దోస్త్ !

సరిగ్గా ఐదేళ్ల కిందట వారిద్దరు రాజకీయ ప్రత్యర్థులు. ఎప్పుడైనా ఎదురుపడినా ఒకరివైపు ఒకరు చూసుకునేవారు కాదు. నిన్న మొన్నటి దాకా అలాగే ఉండేవారు. అయితే అధికార పార్టీలో చోటుచే సుకున్న పరిణామాలు ఆ వైసీపీ నాయకుడి ఆలోచనలు మార్చివే సింది. గౌరవం లేని చోట ఉండటం ఎందుకని భావించి ఏపార్టీని అయితే ప్రత్యర్థిగా భావించి పని చేశారో అదే పార్టీలోకి చేరిపోయారు. ఆయనే మాజీ పోలీస్ అధికారి మహ్మద్ ఇక్బాల్. ఆయనకు ప్రత్యర్థి నందమూరి బాలకృష్ణ. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో వీరిద్దరూ చెరో పార్టీ తరఫున పోటీ చేశారు. అప్పుడు టీడీపీ అభ్యర్థి నందమూరి బాలకృష్ణ గెలుపొందగా ఇక్బాల్ ఓడిపోయారు. వైసీపీ అధికారంలోకి రావ డంతో ఇక్బాల్ హిందూపురం వైసీపీ ఇన్‌చార్జ్‌గా గత ఏడాది జూలై వరకు కొనసాగారు. దీంతో వారి మధ్య రాజకీయ వైరం కొనసాగింది. కానీ పార్టీ తన పట్ల వ్యవహరిస్తున్న తీరును ఇక్బాల్ జీర్ణించుకోలేక పార్టీకి, ఎమ్మెల్సీ పదవికి గుడ్‌బై చెప్పి టీడీపీలో చేరారు. రెండు రోజుల కిందట చిలమత్తూరు మండలంలో వైసీపీ నాయకుడు నాగరాజుయా దవ్, లక్ష్మీనారాయణ యాదవ్ తెలుగుదేశం పార్టీలో చేరారు. వీరు



చేతులు కలిపిన బాలకృష్ణ, ఇక్బాల్

ఎమ్మెల్సీ అనుచరులు కావడంతో చేరిక సందర్భంగా ఇక్బాల్ చిలమత్తూ రుకు వచ్చారు. అక్కడికి బాలకృష్ణ కూడా వచ్చారు. నాగరాజుయాదవ్ ఇంట్లో బాలకృష్ణ, ఇక్బాల్ చేతులు కలిపారు. ఇది చూసిన జనం నాటి ప్రత్యర్థులే నేడు సన్నిహితులయ్యారని ఇద్దరికీ జై కొట్టారు.

- హిందూపురం

చంద్రబాబుతోనే ప్రజాసంక్షేమం

● ఎన్నికల ప్రచారంలో కందికుంట వెంకటప్రసాద్

గాండ్లపెంట/ తనకల్లు, ఏప్రిల్ 20: చంద్రబాబుతోనే ప్రజాసంక్షేమం సాధ్యమని, ఆయన ముఖ్యమంత్రి అయితే అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతాయని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని కురమామిడి పంచాయతీ పాయకట్టు, గొల్లపల్లి, పోతులవాండ్లపల్లి, పచ్చారు మేకలతండా, గాజులవారిపల్లి పెద్దతండా, నల్లగుట్టతండా, గాజులవారిపల్లి గ్రామాలతోపాటు చామలగొంది పంచాయతీలోని గాజులవారిపల్లి, బయ్యారెడ్డిపల్లి, సింగానివారిపల్లి, రెక్కమాను, కురమామిడి, చిన్నక్కగారిపల్లి, వేపరాల, తాళ్లకావుల, సీఎంతండా గ్రామాల్లో శనివారం ఆయన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ప్రజలు, కూటమి శ్రేణులు ఘన స్వాగతం పలికారు. మహిళలు హారతులు పట్టారు. అనంతరం కందికుంట ఇంటింటా తిరిగి సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని ప్రజల్ని అభ్యర్థించారు. చంద్రబాబు సీఎం అయితే అన్ని వర్గాల వారికి సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. ప్రజా సంక్షేమం ఆయనతోనే సాధ్యమన్నారు. సూపర్ సిక్స్ పథకాల వల్ల కుటుంబంలోని ప్రతిఒక్కరికీ లబ్ధి చేకూరుతుందని తెలిపారు. కూటమి విజయానికి అందరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మండలకన్వీనర్ కొండయ్య, సింగల్ విండో మాజీ ప్రెసిడెంట్ వెంకటరామిరెడ్డి, అడ్వకేట్ ప్రతాప్, సర్పంచ్‌లు సుధాకర్, శివప్పనాయుడు, జనసేన మండలాధ్యక్షురాలు సత్యవతమ్మ, చంద్ర, ఆనంద్, కృష్ణనాయక్, బీజేపీ నాయకుడు కేశవరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే తనకల్లు మండలం మల్లిరెడ్డిపల్లి పంచాయతీ ఎర్రగుట్టపల్లి, బాబేనాయక్ తండా, ఆదిరెడ్డిపల్లి, గుర్రబైలు, ఎర్రబల్లి, కొత్తకురవపల్లి(గొల్లపల్లి) మల్లిరెడ్డిపల్లి గ్రామాల్లో శుక్రవారం రాత్రి కందికుంట వెంకటప్రసాద్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ రెడ్డిశేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు నాగమల్లు, శివరాం, వెంకటరమణనాయక్, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, బ్రహ్మానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కదిరిలోని 32వ వార్డులో ప్రచారం చేస్తున్న కందికుంట యశోదమ్మ


గాజులవారిపల్లి పెద్దతండాలో కందికుంటకు హారతి పడుతున్న మహిళలు

టీడీపీలోకి వైసీపీ మద్దతు సర్పంచ్ చేరిక

నంబులపూలకుంట: మండలంలో గూటిబైలు వైసీసీ మద్దతు సర్పంచ్ విష్ణుమూర్తి టీడీపీలోకి చేరారు. గ్రామస్థుల పిలుపు మేరకు టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ శనివారం గూటిబైలుకు వచ్చారు. ఆయన సమక్షంలో సర్పంచ్ విష్ణుమూర్తితో పాటు 40 కుటుంబాల వారు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి కందికుంట కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. తర్వాత అందరూ చంద్రబాబు జన్మదినం సందర్భంగా ఆయన పేరు తిమ్మమాంబకు పూజలు చేయించారు. కేక్‌ను కట్ చేసి పంచారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ చంద్రశేఖర్‌నాయుడు, రాష్ట్ర కార్యదర్శి శివరాంప్రతాప్, మాజీ జడ్పీటీసీ అంజనప్పనాయుడు నాయకులువెంకటనారాయణ, శ్రీనివాసులు, నాగమునినాయుడు తదితరులు పాల్గొన్నారు.

కందికుంట యశోదమ్మ ప్రచారం

కదిరి: పట్టణంలోని 32వ వార్డులో శనివారం టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ సతీమణి కందికుంట యశోదమ్మ ఎన్నికల ప్రచారాన్ని విస్తృతంగా చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలకు సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు. చంద్రబాబు సీఎం అయిన వెంటనే వాటిని అమలు చేస్తారని చెప్పారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి కూటమి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. నాయకులు ఫర్వీన్‌భాను తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాలనలో రాష్ట్రం భ్రష్టు

● ఎన్నికల ప్రచారంలో పల్లె సింధూరా రెడ్డి


కొత్తచెరువు ప్రచారంలో పాల్గొన్న పల్లె సింధూర, కూటమి శ్రేణులు


ఎద్దులవాండ్లపల్లి తండాలో ప్రచారం చేస్తున్న పల్లె కృష్ణకిశోర్ రెడ్డి


గూనిపల్లిలో మాట్లాడుతున్న మాజీ మంత్రి పల్లె

కొత్తచెరువు, ఏప్రిల్ 20: ఒక ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన వైఎస్ జగన్ రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించారని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి పల్లెసింధూరారెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలో బీసీ కాలనీ, వేణుగోపాల్ నగర్‌లో శనివారం ఆమె ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి ప్రజల్ని ఆప్యాయంగా పలకరిస్తూ.. సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. చంద్రబాబు సీఎం అయితే చేపట్టే అభివృద్ధి పనులను వివరించారు. ముఖ్యంగా సూపర్‌సిక్స్ పథకాల గురించి తెలిపారు. వాటి వల్ల కుటుంబంలో ప్రతిఒక్కరికీ లబ్ధి చేకూరుతుందని చెప్పారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన వెంటనే పథకాలను అమలు చేస్తారని పేర్కొన్నారు. ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా బీకే పార్థసారధని గెలిపించాలని కోరారు. అంతకుమునుపు టీడీపీ అధినేత చంద్రబాబ జన్మదిన వేడుకలను టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల నాయకులు, కార్యకర్తల నడుమ జరుపుకున్నారు. కేక్‌కట్ చేసి అందరికీ పంచారు. కార్యక్రమంలో కూటమి పార్టీల శ్రేణులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

కూటమితోనే నియోజకవర్గ అభివృద్ధి

నల్లమాడ: పుట్టపర్తి నియోజకవర్గ అభివృద్ధి కూటమితోనే సాధ్యమని ఆ పార్టీ యువ నాయకుడు పల్లె కృష్ణకిశోర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని అరవవాండ్లపల్లితండా, ఎద్దులవాండ్లపల్లితండా, బాసంవారిపల్లి, పెమనకుంటపల్లి, పెమనకుంటపల్లి తండా, బీసీ కాలనీలో శనివారం ఆయన ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఇంటింటా తిరిగి టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి పల్లె సింధూరారెడ్డిని సైకిల్ గుర్తుకు ఓటువేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. గడిచిన ఐదేళ్లలో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టలేదన్నారు. ఈ సారి సింధూరారెడ్డిని గెలిపిస్తే నియోజవర్గాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేస్తారన్నారు. కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గూనిపల్లి పంచాయతీలో పల్లె ప్రచారం

బుక్కపట్నం: మండలంలోని గూనిపల్లి పంచాయతీలో మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరంగా చేపట్టారు. ఈ సందర్భంగా రోడ్డుషో చేస్తూ కూటమిని గెలిపించాలని ప్రజలను కోరారు. చంద్రబాబు సీఎం అయితేనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. సంక్షేమ పథకాలు కూడా అన్నివర్గాల ప్రజలకు అందుతాయన్నారు. వైసీపీ పాలనలో అన్నీ అరాచకాలే జరిగాయన్నారు. పుట్టపర్తి నియోజకవర్గంలో అయితే గంజాయి, మద్యం, భూమాఫీయా విచ్చలవిడిగా సాగిందన్నారు. వీటికి అడ్డుకట్ట వేయాలంటే టీడీపీ కూటమి అధికారంలోకి రావాలన్నారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా పల్లె సింధూరారెడ్డిని, ఎంపీగా బీకే పార్థసారధిని గెలిపించాలన్నారు. తొలుత చంద్రబాబు జన్మదినం సందర్భంగా నాయకులు, కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో కన్వీనర్ చింతా మల్లిరెడ్డి, నాయకులు సామకోటి ఆదినారాయణ, వెంకటనారాయణరెడ్డి, సుబ్బారెడ్డి, గోపాలపురం గంగాధర్, జయప్ప, బొట్టు క్రిష్టప్ప, పల్లపు రవీంద్రా, దేశెట్టి రామాంజులు, జంగం వెంకటరాముడు, తెలుగుయువత సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

కారు బోల్తా.. భార్య మృతి

● భర్తకు గాయాలు


ఉమామహేశ్వరి (ఫైల్)

కదిరిఅర్బన్, ఏప్రిల్ 20: మండలంలోని కౌవులేపల్లి వద్ద శుక్రవారం అర్ధరాత్రి సమయంలో కారు బోల్తాపడిన ఘటనలో ఒకరు మృతి చెందగా, మరొకరికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. కదిరి పట్టణానికి చెందిన దివాకర్, ఉమామహేశ్వరి దంపతులు ప్రభుత్వ ఉపాధ్యాయులుగా విధులు నిర్వర్తిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు. పెద్దకుమారుడు సందీప్ బీటెక్ చదువుతుండగా, రెండో కుమారుడు జయదీప్ ఇటీవల పది పరీక్షలు రాశాడు. కాగా చిన్నకుమారుడికి ఇంటర్ ప్రవేశాలకోసం భార్యభర్త తిరుపతికి శుక్రవారం ఉదయం కారులో వెళ్లారు. పని అనంతరం వెంటనే తిరిగి వస్తుండగా పదినిమిషాలకు గమ్యస్థానానికి చేరుకునే సమయంలో కౌలేపల్లి వద్ద కారు ముందరి టైర్ పగలి బోల్తాపడింది. ప్రమాదంలో ఉమామహేశ్వరి(45) అక్కడికక్కడే మృతిచెందగా, దివాకర్‌కు గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో క్షతగాత్రుడిని కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలు కదిరి రూరల్ పరిధిలోని గంగన్నగారిపల్లి ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్నారు.

రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్య

ధర్మవరం, ఏప్రిల్ 20: పట్టణంలోని డీఎల్ఆర్ కాలనీ సమీపంలో శనివారం ఓ వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు హిందూపురం రైల్వే హెడ్‌కానిస్టేబుల్ ఎర్రిస్వామి తెలిపారు. ఉదయం రైల్వే కీమెన్ గమనించి హిందూపురం రైల్వేపోలీసులకు సమాచారం అందించారు. దీంతో హెడ్‌కానిస్టేబుల్ ఎర్రిస్వామి ధర్మవరంలోని డీఎల్ఆర్ కాలనీకి వచ్చి అక్కడ రైలు పట్టాల పక్కన పడి ఉన్న మృతదేహాన్ని పరిశీలించారు. ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి పేరు రామాంజనేయులు అని, ఇతడి వయసు 55 నుంచి 60 ఏళ్ల మధ్యన ఉంటాయని గుర్తించారు. మృతుడి వద్ద సూసైడ్ నోట్ ఉందని, అందులో తీవ్ర మానసిక ఒత్తిడితోనే తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు ఉందని హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టినట్లు చెప్పారు. అయితే మృతుడి వివరాలు పూర్తిగా తెలియలేదన్నారు. ఎవరికైనా సమాచారం తెలిస్తే 9441238182, 9440627641 కు సమాచారం అందించాలని ఆయన కోరారు.

ఉపాధి కూలీకి పాముకాటు

నల్లచెరువు, ఏప్రిల్ 20: మండలంలోని రాజంవాండ్లపల్లికి చెందిన ఉపాధి కూలీ ఆంజనేయులు పాముకాటుకు గురయ్యాడు. గ్రామ సమీపంలోని కొండ వద్ద శనివారం ఆయన ఉపాధి పనుల నిమిత్తం కందకాలు తీస్తుండగా.. విష సర్పం కాటు వేసింది. గమనించిన తోటి కూలీలు వెంటనే అతడిని కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. తర్వాత మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించినట్లు ఏపీఓ మంజుల తెలిపారు.

బాలుడికి..

గోరంట్ల, ఏప్రిల్ 20: మండలంలోని బీ గొల్లపల్లిలో శివ అనే 12యేళ్ల బాలుడు శనివారం పాముకాటుకు గురై అస్వస్థత పొందాడు. బీ గొల్లపల్లికి చెందిన నంజుడప్ప కుమారుడు శివ. ఇంటి బయట ఆడుకుంటుండగా, ప్రమాదవశాత్తు కట్ల పామును తొక్కడంతో, అది అతడి కుడికాలి వేళ్లపై కాటు వేసింది. అస్వస్థతకు గురైన బాలుడిని గోరంట్ల ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. డాక్టర్ వినోద్‌కుమార్ వైద్య చికిత్సలు అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం 108లో హిందూపురం తరలించారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

పుట్టపర్తి రూరల్, ఏప్రిల్ 20: పుట్టపర్తి మునిసిపాలిటీ పరిధిలోని ఎనుమల పల్లి చెరువు సమీపంలో గల వ్యవసాయ బావిలో శనివారం గుర్తుతెలియని మృతదేహం లభ్యమైనట్లు పట్టణసీఐ కొండారెడ్డి తెలిపారు. మృతిచెంది నాలుగైదురోజులు కావడంతో మృతదేహం బాగా కుళ్లిపోయిందని, దీంతో ఆనవాళ్లు గుర్తించడం కష్టతరంగా మారిందని అన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు. కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

బస్సు ఢీకొని ఒకరికి తీవ్రగాయాలు

ధర్మవరం, ఏప్రిల్ 20: ఆర్టీసీ అద్దె బస్సు ఢీకొని పెయింటర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. వన్‌టౌన్ పోలీసులు శనివారం తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. ఫణీంద్ర ధర్మవరం పట్టణంలో పెయింటర్‌గా జీవనం సాగిస్తున్నాడు. కాగా అతను శుక్రవారం రాత్రి అనంతపురం నుంచి బస్సులో వచ్చి ధర్మవరం బస్టాండ్‌లో దిగి బయటకు నడుచుకుంటూ వెళ్తున్నాడు. ధర్మవరం డిపోకు చెందిన ఆర్టీసీ అద్దె బస్సు బస్టాండ్‌లోకి వస్తూ ఎదురుగా వస్తున్న ఫణీంద్రను ఢీకొంది. ప్రమాదంలో అతను తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు క్షతగాత్రున్ని సమీప ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో కుటుంబసభ్యులు అనంతపురంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు.

ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉన్నాం: సత్యకుమార్

● కూటమి అభ్యర్థులను గెలిపిద్దాం: మందకృష్ణ మాదిగ



ఎమార్పీఎస్ సదస్సులో మాట్లాడుతున్న సత్యకుమార్‌యాదవ్

ధర్మవరం, ఏప్రిల్ 20: రాష్ట్రంలో ఎన్నో ఏళ్లగా ఎదురు చూస్తున్న ఎస్సీ వర్గీకరణకు నరేంద్రమోదీ, చంద్రబాబునాయుడు కట్టుబడి ఉన్నారని కూటమి బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి సత్యకుమార్‌యాదవ్ పేర్కొన్నారు. పట్టణంలోని సీఎన్‌బీ కల్యాణమండపంలో శనివారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో హిందూపురం, అనంతపురం పార్లమెంట్ నియోజకవర్గాల సదస్సు జరిగింది. కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు నరేంద్ర అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథులుగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణమాదిగ, కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి సత్యకుమార్‌యాదవ్, ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారధి, జనసేన రాష్ట్ర ప్రధానకార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు. సత్యకుమార్ మాట్లాడుతూ... ఎస్సీ వర్గీకరణ కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కూటమి అధికారం చేపట్టడం ద్వారానే సాధ్యమవుతుందన్నారు. ధర్మవరంలో బీజేపీ తరఫున పోటీ చేస్తున్న తనకు కమలం గుర్తుకు ఓటు వేయాలని, హిందూపురం ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బీకే పార్థసారధిని సైకిల్ గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు. మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ... వైసీపీ ప్రభుత్వంలో మాదిగలకు అడుగడుగునా అన్యాయమే జరిగిందన్నారు. మాదిగలపై దౌర్జన్యాలు, దాడులు పెచ్చుమీరాయన్నారు. మాదిగలపై దాడులు చేస్తున్న జగన్‌కు బుద్ధి చెప్పాలంటే కూటమిని గెలిపించడం ద్వారానే సాధ్యమవుతుందన్నారు. అంతేకాకుండా వర్గీకరణ తమ ప్రథమ లక్ష్యమని, అది నెరవేరాలంటే రాష్ట్రంలో చంద్రబాబు అధికారం చేపట్టాలన్నారు. అందుకు కోసం ప్రతి మాదిగ వచ్చే ఎన్నికలలో కూటమి అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని కోరారు. ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారధి మాట్లాడుతూ... మొదటి నుంచి మాదిగలు టీడీపీ వైపే ఉన్నారన్నారు. వచ్చే ఎన్నికలలో కూడా అదే అభిమానాన్ని చాటి కూటమిని గెలిపించాలని అభ్యర్థించారు. ఇంకా చిలకం మధుసూదన్‌రెడ్డి, గుడిసె దేవానంద్ మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ మేకల రామాంజినేయులు, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.


గొట్లూరులో ప్రచారం చేస్తున్న సత్యకుమార్‌యాదవ్, బీకేపార్థసారథి, చిలకంమధు

సత్యకుమార్‌యాదవ్ విస్తృత ప్రచారం

ధర్మవరంరూరల్: మండలంలోని మల్లేనిపల్లి, తుమ్మల, తిప్పేపల్లి, సుబ్బరావు పేట, నాగలూరు, గొట్లూరు, మల్కాపురం, బడన్నపల్లి, గొల్లపల్లి గ్రామాల్లో శనివారం కూటమి బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి సత్యకుమార్‌యాదవ్ ఎన్నికల ప్రచారం చేపట్టారు. గొట్లూరు గ్రామంలోని ప్రచారంలో ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారథి, జనసేన నాయకుడు చిలకంమధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు. వారు ఇంటింటా తిరిగి ఎమ్మెల్యేకు కమలం గుర్తుకు, ఎంపీకి సైకిల్‌గుర్తుకు ఓటు వేయాలని ప్రజలను అభ్యర్థించారు. సత్యకుమార్ మాట్లాడుతూ తనను గెలిపిస్తే నియోజకవర్గ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అంతకుమునుపు చంద్రబాబు జన్మదినం సందర్భంగా వారు గ్రామంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్మన్ చిగిచెర్ల ఓబిరెడ్డి, నాయకులు గోనుగుంట్ల విజయ్ కుమార్, మాజీ ఎంపీపీ వేణుగోపాల్‌రెడ్డి, మహేష్‌చౌదరి, కన్వీనర్ పోతుకుంటలక్ష్మన్న, మాజీ జడ్పీటీసీ మేకలరామాంజనేయులు, గొట్లూరుశ్రీనివాసులు, తలారి వెంకటలక్ష్మీ, రాఘవరెడ్డి పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం

ఓబుళదేవరచెరువు, ఏప్రిల్ 20: టీడీపీ అధికారంలోకి వస్తే చేపట్టనున్న సూపర్ సిక్స్‌పథకాలపై శనివారం మండలకేంద్రంలో టీడీపీ నాయకులు ఇంటింటా ప్రచారం చేశారు. ప్రజలకు కరపత్రాలు పంచుతూ పథకాల వల్ల కలిగే లబ్ధి గురించి వివరించారు. చంద్రబాబు సీఎం కాగానే ఈ పథకాలను అమలు చేస్తారన్నారు. ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పల్లె సింధూరారెడ్డిని , ఎంపీగా బీకే పార్థసారధిని గెలించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ పిట్టా ఓబులరెడ్డి, నాయకులు మండోజీ ఆర్పీనాయక్, మస్తానమ్మ, భాగ్యమ్మ, అఖిల, జ్యోతి, బాషా తదితరులు పాల్గొన్నారు. అలాగే కొండకమర్లలో ఆర్ఎంపీ జాకీర్, పొగాకు షాన్వాజ్, బాలక్రిష్ణారెడ్డి దిల్‌షాద్, సురేష్ తదితరులు సూపర్ సిక్స్‌పై ప్రచారం చేశారు.

ధర్మవరం: పట్టణంలో 10, 11, 12, 13వ వార్డులలో టీడీపీ నాయకులు సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి పథకాల ప్రయోజనాలను ప్రజలకు వివరించారు. చంద్రబాబు సీఎం అవగానే వాటిని అమలు చేస్తారన్నారు. ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ,బీజేపీ,జనసేన నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారంలో వలంటీర్లు



ప్రచారంలో పాల్గొన్న వలంటీర్లు, మద్యం దుకాణంలోని సేల్స్‌మెన్

గాండ్లపెంట, ఏప్రిల్ 20: వైసీపీ ఎన్నికల ప్రచారంలో వలంటీర్లు, ప్రభుత్వం మద్యం దుకాణంలోని సేల్స్‌మెన్ పాల్గొన్నారు. వైసీపీ కండువాలు వేసుకుని మరీ ఇంటింటి ప్రచారం చేశారు. మండలంలోని తూపల్లి, కటకంవారిపల్లి గ్రామాల్లో శనివారం వైసీపీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇందులో మద్యం దుకాణం సేల్స్ మెన్ ఫిరోజ్, వలంటీర్లు అబ్దుల్ మజీద్, సుధీర్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి వైసీపీకి ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. ప్రభుత్వ ఉద్యోగులు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, వీల్లుఅసిస్టెంట్లు ఎన్నికల ప్రచారంలో పాల్గొనకూడదని ఎన్నికల కమిషన్ చెబుతున్నా, కొందరు వాటిని బేఖాతార్ చేస్తూ ప్రచారంలో పాల్గొంటూనే ఉన్నారు.

రూ.96,910 నగదు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న నగదుతో సీఐ సుబ్రమణ్యం, సిబ్బంది

ధర్మవరం, ఏప్రిల్ 20: ఎటువంటి బిల్లులు లేకుండా డబ్బులు తీసుకెళ్తున్న వ్యక్తి నుంచి రూ.96,910 నగదును స్వాధీనం చేసుకున్నట్లు వన్‌టౌన్ సీఐ సుబ్రమణ్యం తెలిపారు. పట్టణంలోని ఎర్రగుంట్ల సర్కిల్‌లో శనివారం ఆయన ఎస్ఐ శ్రీనివాస్ ,సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేశారు. ఇందులో ధర్మవరం మండలం ఓబుళనాయనపల్లికి చెందిన అమర ఆదిశేషయ్య ఎటువంటి బిల్లులు లేకుండా వాహనంలో రూ. 96,910 నగదును తీసుకెళ్తూ పట్టుబడ్డాడు. ఎన్నికల నిబంధనల మేరకు ఇంత డబ్బు తరలించరాదని తెలియజేసి ఆ నగదును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. నిర్దేశించిన విలువకు మించి డబ్బులు తరలించరాదని పేర్కొన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత


స్వాధీనం చేసుకున్న మద్యంతో డీఎస్పీ వాసుదేవన్, సీఐ రాజా రమేశ్

కొత్తచెరువు,ఏప్రిల్ 20: కర్ణాటక నుంచి అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని శనివారం మధ్యాహ్నం పట్టుకున్నట్టు డీ ఎస్పీ వాసుదేవన్ తెలిపారు. మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. బుక్కపట్నం మండలం లింగప్పగారిపల్లికి చెందిన చంద్రశేఖర్, బళ్లారి శివయ్య ద్విచక్ర వాహనంలో లగేజీతో ధర్మవరం వైపునకు వెళ్తుండగా అనుమానం వచ్చి తనిఖీ చేశామన్నారు. వారి వద్ద సంచులు పరిశీలించగా అందులో 11కేసుల కర్ణాటక టెట్రాప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరిద్దరిపై కేసు నమోదు చేశామని చెప్పారు. ఈ సమావేశంలో సీఐ రాజారమేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో రేషం షెడ్డు దగ్ధం

నల్లమాడ, ఏప్రిల్ 20: మండలంలోని పులంగపల్లిలో రైతు కేశవరెడ్డికి చెందిన రేషం షెడ్డు షార్ట్‌సర్క్యూట్ జరిగి దగ్ధమైంది. శుక్రవారం రాత్రి పొద్దుపోయాక షెడ్డుకు దగ్గరలో ఉన్న విద్యుత్ స్తంభంలోని తీగలు షార్ట్ సర్క్యూట్ కావడంతో నిప్పులు షెడ్డుపై పడ్డాయని, దీంతో మంటలు చెలరేగి షెడ్డు దగ్ధమైందని బాధితుడు శనివారం తెలిపారు. షెడ్డులో మూడువందల రేషం గు డ్లు, పురుగులు కాలిపోయినట్లు చెప్పారు. దాదాపు రూ. ఒకటిన్నర లక్ష నష్టం జరిగిందన్నారు. సంబంధిత అధికారులు పరిశీలించి సాయం చేయాలని ఆయన కోరారు.

పాలపాటిదిన్నెలో ప్రత్యేక పూజలు

నల్లచెరువు, ఏప్రిల్ 20: మండలంలోని పాలపాటి దిన్నె ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలను ఘనంగా నిర్వహించారు. వేకువజామునే అర్చకులు స్వామివారి మూలవిరాట్‌కు పలుఅభిషేకాలు చేసి అలంకరణలు చేపట్టారు. అనంతరం అర్చనలు, ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

నేడు ఆదర్శపాఠశాల ప్రవేశ పరీక్ష

పుట్టపర్తి రూరల్, ఏప్రిల్ 20: మండలంలోని జగరాజుపల్లి ఆదర్శపాఠశాలలో ఆరో తరగతి ప్రవేశానికి గాను పరీక్ష ఆదివారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నామని ప్రిన్సిపాల్ రమేష్‌బాబు శనివారం ప్రకటనలో తెలిపారు. ఇందుకు హాల్‌టిక్కెట్లు పొందిన వారు పరీక్షా కేంద్రానికి అరగంట ముందే చేరుకోవాలన్నారు.

ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు యూనిఫాం వితరణ

తనకల్లు, ఏప్రిల్ 20: మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నతపాఠశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు రూ.30వేలు విలువైన యూనిఫాంను శనివారం వితరణ చేశారు. పూర్వ విద్యార్థుల అసోసియేషన్ అధ్యక్షుడు దేశాయి కరుణాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో యూనిఫాం ను హెచ్ఎం మల్లికార్జున అందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల అసోసియేషన్ కార్యదర్శి రామాంజనేయులు , ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా చంద్రబాబు జన్మదిన వేడుకలు

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి జన్మదిన వేడుకలను పుట్టపర్తి, కదిరి, ధర్మవరం నియోజకవర్గాల వ్యాప్తంగా శనివారం ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గాల కేంద్రాలతో పాటు మండలకేంద్రాలు, గ్రామాల్లో సైతం టీడీపీ నాయకులు, కార్యకర్తలు వేడుకలను పెద్దఎత్తున చేపట్టారు. ఈ సందర్భంగా కేకులు కట్ చేశారు. అందరికీ స్వీట్లు పంచారు. పలువురు మాట్లాడుతూ చంద్రబాబు ఇలాంటి పుట్టినరోజు వేడుకలను మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. పలుచోట్ల దేవాలయాల్లో చంద్రబాబు పేరు మీద పూజలు, అర్చనలు చేయించారు. ఇంకొన్ని ప్రాంతాల్లో అన్నదానాలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలతో పాటు అభిమానులు పాల్గొన్నారు.


బుక్కపట్నం మండలం గూనిపల్లిలో జనసేన కార్యకర్తకు కేక్ తినిపిస్తున్న మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి


గాండ్లపెంట మండలం రెక్కమానులో కేక్ కట్ చేస్తున్న కందికుంట వెంకటప్రసాద్


ధర్మవరం మండలం గొట్లూరులో కేక్ కట్ చేస్తున్న సత్యకుమార్‌యాదవ్, బీకే పార్థసారథి, చిలకం మధు


నల్లమాడ మండలం పెమనకుంటపల్లిలో కేక్ కట్ చేస్తున్న పల్లె వెంకట కృష్ణ కిశోర్‌రెడ్డి


పుట్టపర్తిలో అన్నదానం చేస్తున్న తెలుగుయువత నాయకులు

సరిహద్దులో ముమ్మర తనిఖీలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ గోపి

లేపాక్షి, ఏప్రిల్ 20: సార్వత్రిక ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదలైన సందర్భంగా కర్ణాటక సరిహద్దు ప్రాంతాల్లో తనిఖీలు ముమ్మరం చేయాలని ఉన్నతాధికారుల ఆదేశాలు జారీచేశారు. సిబ్బంది నిర్లక్ష్యంతో రెండ్రోజులుగా సరిహద్దు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించలేదు. దీనిపై 'సరి హద్దులో తనిఖీలు నిల్' అనే శీర్షికతో ఆంధ్రజ్యోతి దినపత్రికలో శనివారం కథనం వెలువడిన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన ఎస్ఐ గోపి తన సిబ్బందితో శనివారం సరిహద్దు ప్రాంతాల్లో వాహనాల తనిఖీలు నిర్వహించారు. సిబ్బందిని నియమించి, జాగ్రత్తగా పర్యవేక్షించాలని ఆదేశించారు.

వలంటీర్ల రాజీనామా

చిలమత్తూరు, ఏప్రిల్ 20: మండలంలోని వీరాపురం, చిలమత్తూరు, కోడూరు సచివాలయాలకు సంబంధించిన 30 మంది వరకు గ్రామ వలంటీర్లు రాజీనామా చేశారు. తమ రాజీనామా పత్రాలను శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయలో ఎంపీడీఓ రామ్‌కుమార్‌కు అందజేశారు.

గోరంట్ల: మేజర్ పంచాయతీ గోరంట్ల పరిధిలోని 26మంది వలంటీర్లు శనివారం రాజీనామా చేశారు. గోరంట్ల పంచాయతీలో 140మంది వలంటీర్లు పనిచేస్తుండగా ఇప్పటివరకు 80మంది రాజీనామా చేశారు. మండల వ్యాప్తంగా 248మంది రాజీనామా చేసినట్లు ఎంపీడీఓ కార్యాలయ అధికారులు తెలిపారు.

టీడీపీ నాయకుల మృతికి సంతాపం

గోరంట్ల, ఏప్రిల్ 20: పట్టణానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు, సింగిల్ విండో మాజీ డైరెక్టర్ రహంతుల్లా (82) అనారోగ్యంతో శనివారం మృతిచెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన చికిత్స పొందుతూ గోరంట్లలోని తన నివాసంలో ఉదయం మృతిచెందారు. పలువురు టీడీపీ నాయకులు మృతదేహాన్ని సందర్శించి, నివాళ్లలర్పించారు. మృతుడి కుమారుడు టీడీపీ మైనార్టీ జిల్లా సహాయ కార్యదర్శి అజంతుల్లాను పరామర్శించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వెంకటేశ్వరరావు, నిమ్మల యువశేఖర్, కన్వీనర్ సోముశేఖర్, దేవ నరసింహప్ప, అశ్వర్థరెడ్డి, బెల్లాలచెరువు చంద్ర, కక్కల రఘు, బాలక్రిష్ణ, పిరోజ్ బాషా, వృషభ, చాంద్‌బాషా, జనసేన సంతోష్, అనిల్‌కుమార్ తదితరులున్నారు.

పెనుకొండ రూరల్: మండలంలోని అమ్మవారిపల్లిలో టీడీపీ కార్యకర్త ఓబులేశు శనివారం అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత ఆ గ్రామానికి చేరుకుని ఓబులేశు భౌతికకాయాన్ని సందర్శించారు. పూలమాలలు వేసి నివాళులర్పించారు. అతడి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య

పెనుకొండ రూరల్, ఏప్రిల్ 20: పెళ్లికాలేదనే మనస్తాపంతో దుద్దేబండ పాత రైల్వేస్టేషన్ సమీపంలో బోయ రమేష్(28) అనే యువకుడు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే ఎస్ఐ బాలాజీనాయక్ తెలిపారు. మండలంలోని కురుబవాండ్ల పల్లికి చెందిన బోయ ఆంజనేయులు, చెన్నమ్మ దంపతుల కుమారుడు బోయ రమేష్ కూలి పనిచేస్తూ జీవనం సాగించేవాడు. తనకింకా పెళ్లి కాలేదని రమేష్ కొన్ని నెలల నుంచి బాధపడుతుండే వాడు. దీంతో తాగుడుకు బానిసయ్యాడు. చివరకు మనస్తాపానికి గురై శనివారం దుద్దేబండ పాత రైల్వేగేటు వద్ద రైలు కిందపడి ఆత్మ హత్య చేసుకున్నట్లు రైల్వే ఎస్ఐ తెలిపారు. మృతుడి తల్లి చెన్నమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్ఐ బాలాజీనాయక్ తెలిపారు. కీమెన్ అందించిన సమాచారం మేరకు సంఘటనా స్థలాన్ని పరిశీలించామన్నారు. మృతదేహాన్ని పెనుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

బాలుడికి పాముకాటు

గోరంట్ల, ఏప్రిల్ 20: మండలంలోని బీ గొల్లపల్లిలో శివ అనే 12యేళ్ల బాలుడు శనివారం పాముకాటుకు గురై అస్వస్థత పొందాడు. బీ గొల్లపల్లికి చెందిన నంజుడప్ప కుమారుడు శివ. ఇంటి బయట ఆడుకుంటుండగా, ప్రమాదవశాత్తు కట్ల పామును తొక్కడంతో, అది అతడి కుడికాలి వేళ్లపై కాటు వేసింది. అస్వస్థతకు గురైన బాలుడిని గోరంట్ల ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. డాక్టర్ వినోద్‌కుమార్ వైద్య చికిత్సలు అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం 108లో హిందూపురం తరలించారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

గోరంట్ల, ఏప్రిల్ 20: చిలమత్తూరు మండలంలోని పలగలపల్లికి చెందిన వందన అనే మహిళ విషపు గుళికలు మింగి శనివారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. పలగలపల్లికి చెందిన ఆనంద్ భార్య వందన కుటుంబ సమస్యల కారణంగా అత్తతో శనివారం గొడవ పడినట్లు గ్రామస్తులు తెలిపారు. అత్త మందలించిదని తీవ్ర మనస్థాపానికి గురైన ఆమె ఇంట్లో విషపు గుళికలు తినింది. అస్వస్థతకు గురైన ఆమెను బంధువులు గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా డాక్టర్ ఉష చికిత్సలు అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం 108లో హిందూపురం తరలించారు.

సినీ ఫక్కీలో లారీ ఛేజింగ్

పెనుకొండ టౌన్, ఏప్రిల్ 20: అనుమానం వచ్చిన లారీని సార్వత్రిక ఎన్నికల క్రమంలో స్థానిక పోలీ సులు సినీఫక్కీలో ఛేజ్ చేశారు. పెనుకొండ మండ లంలోని గొర్రెల పెంపకం క్షేత్రం వద్ద శనివారం ఎన్నికల ఫ్లైయింగ్‌స్క్వాడ్ అనుమానం వచ్చిన వాహనాలను ఆపారు. అయితే ఓ లారీని డ్రైవర్ ఆపకుండా వేగంగా ముందుకు తీసుకెళ్లాడు. దీంతో పోలీసులు స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించి లారీని పెనకొండ ఎన్టీఆర్ సర్కిల్ వద్ద పట్టుకున్నారు. లారీని, డ్రైవర్‌ను స్టేషన్‌కు తరలించి, విచారిస్తున్నట్లు ఎస్ఐ రాజేష్ తెలిపారు. ఇదిలా ఉంటే లారీ డ్రైవర్ అతివేగం, రాంగ్‌రూట్‌లో వెళ్లడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు.



పట్టుబడిన లారీ

అభివృద్ధికి, అవినీతికి మధ్య యుద్ధం

మద్దతు ఎవరికో మీరే నిర్ణయించుకోవాలి : సవిత



శ్రీరంగరాజుపల్లిలో మాట్లాడుతున్న సవిత

హిందూపురం అర్బన్, ఏప్రిల్ 20: అభివృద్ధి చేసే చంద్రబాబుకు, అవనీతి కి పాల్పడే జగన్ మధ్య జరిగే ఎన్నికల యుద్ధంలో ఎవరికి మద్దతు ఇస్తారో మీరే తెలుసు కోవాలని పెనుకొండ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత ప్రజలకు పిలుపునిచ్చారు. పరిగి మండలం పాపిరెడ్డిపల్లి, శ్రీరంగరాజుపల్లి, ముళ్ళమోతుకపల్లి, మోదా గ్రామాల్లో శని వారం ఆమె ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సవిత మాట్లాడుతూ ... ఒక్క చాన్స్ ఇవ్వాలని కోరి అధికారంలోకి వచ్చిన తరువాత సీఎం జగన్ ప్రజలకు పట్టపగలే చుక్కలు చూపించారని విమర్శించారు. రాష్ట్రంలో సంతోషంగా ఉన్నామని చెప్పేవారు ఎవరైనా ఉన్నారా అని ప్రజలను అడిగారు. ఈ ఐదేళ్లలో అభివృద్ధి శూన్యమ న్నారు. సంక్షేమ పథకాలు అందిస్తున్నామంటూ ప్రజలను మభ్యపెడుతున్నారని, అసలు సం క్షేమ పథకాలు ప్రవేశపెట్టింది ఎన్టీ ఆర్ అన్నారు. ఇప్పటికే ఓ వలస పక్షి వచ్చి ఉన్నది దోచుకెళ్లగా, మరలా ఇప్పుడు కళ్యాణదుర్గం నుంచి ఒకరు, బళ్లారి నుంచి మరొకరు వచ్చారన్నా రు. ఇంక వారు దోచు కుపోవాలని చూస్తే ప్రజలు ఊరుకోరని ఎద్దేవ చేశారు. వైసీపీ వారు ఏ ముఖం పెట్టుకుని ఓటు అడు గుతారని నిలదీశారు. ఇచ్చిన హామీలలో ఏ ఒక్కటైనా నెరవేర్చారా అని ప్రశ్నించారు. ఈ ఐదేళ్లలో బాగా దోచు కున్నారని, కాబట్టి ఓట్లను కొనాలని చూస్తున్నారన్నారు. గ్రామాల్లో ఉన్న గుడి, బడి, వీధిలైట్లు, రోడ్లు, డ్రైన్లు, బోర్లు అన్నీ టీడీపీ హయాంలో జరిగినవే అన్నారు. వాళ్ల డబ్బు ఇస్తే తీసుకోండి, కానీ ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు, ఎంపీ అభ్యర్థిగా బీకే పార్థసారథికి ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని, పరిగి మండల అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఆమె వెంట మాజీ జడ్పీటీసీ ధనాపురం సూరి, మాజీ ఎంపీపీ కాలువపల్లి సత్యనారాయణ, నాయకులు గోవిందరెడ్డి, ఈశ్వరయ్య, నరసింహమూర్తి, కన్నా, శ్రీనివాసరెడ్డి, బీజేపీ నాయకుడు చంద్ర, జనసేన నాయకులు పెద్ద సంఖ్య లో గ్రామస్థులు పాల్గొన్నారు.

టీడీపీలోకి పలువురి చేరిక

రొద్దం : మండలపరిధిలోని కలిపి గ్రామం ఎస్సీ కాలనీకి చెందిన 25కుటుంబాలు వైసీపీని వీడి శుక్ర వారం రాత్రి టీడీపీలో చేరారు. వారికి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత పెనుకొండలోని టీడీపీ కార్యా లయంలో కండువాలువేసి టీడీపీలోకి ఆహ్వానించారు. టీడీపీలో చేరినవారిలో శ్రీనివాసులు, అశోక్, రాము, హరిక్రిష్ణ, నాగరాజు, నవీన్, వెంకటేశ్, నాగేంద్ర, సుబ్బ రాయుడు, శంకరప్ప, లహరి, వెంకటేశులు, బాబు, అనీ ల్‌కుమార్, ఆటో డ్రైవర్ నాగరాజు, చంద్రశేఖర్, నరసింహ, మల్లప్ప, రామాంజినప్ప పాల్గొన్నారు.

హిందూపురం అర్బన్: టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత సమక్షంలో పరిగి మండలం ముళ్ళమోతుకపల్లికి చెందిన 40 కుటుంబాలు టీడీపీలోకి చేరాయి. ఆమె శనివారం పరిగి మండలంలో సవిత విస్తృత ప్రచారం చేపట్టారు. టీడీపీ నాయకుడు గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జగన్నాథ్‌రెడ్డితో పాటు 40 కటుంబాలు సవిత సమక్షంలో టీడీపీ కండువా కప్పుకున్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్ర భవిష్యత్తు

- ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ
- ఘనంగా చంద్రబాబు జన్మదిన వేడుకలు

హిందూపురం, ఏప్రిల్ 20 : టీడీపీ అధినేత నారాచంద్రబాబు నాయుడుపైనే రాష్ట్ర భవిష్యత్తు ఆధారపడి ఉందని హిందూపురం సిట్టింగ్ ఎమ్మెల్యే నందమూరి బాల కృష్ణ పేర్కొన్నారు. చంద్రబాబు జన్మదిన వేడుకలను ఆయన శనివారం పట్టణంలోని తన నివాసం వద్ద ఘనంగా జరుపుకున్నారు. తెలుగుతమ్ముళ్ల మధ్య భారీ కేక్ కట్చే శారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ... చంద్రాబాబు 75 ఏళ్ల వయసులోనూ రాష్ట్రం కోసం నమ్ముకున్న జనం కోసం యువకుడిలా కష్టపడుతున్నా రని కొనియాడా రు. బాబు 46ఏళ్లపాటు ప్రజాసేవలో తరించి తెలుగువారికి రేపటి వెలుగు చూపిన ప్రకాశకుడని, తెలుగుఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసిన దార్శనీకుడన్నారు. రాజకీయాల్లో తెలుగువారి ప్రభావం చాటారన్నారు. బడుగు బలహీనవర్గాల, మైనార్టీల ఉన్నతికి తోడ్పడ్డారన్నారు. ఎన్టీఆర్ ఆశయ సాధనకు కంకణ బద్ధుడైన బాబు భవిష్యత్ తరాలకోసం మళ్లీ ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావాలన్నారు. ఈ రాష్ట్రం అలాగే ఎదురు చూస్తోందన్నారు. ఆయన ముఖ్యమంత్రి అయితే రాష్ట్రం భవిష్యత్తు మారుతుందన్నారు. ఈ రోజు ఆయన చేసిన అభివృద్ధి మాత్రమే కళ్లముందు కదలాడుతోందన్నారు. ఈ సందర్భంగా భారీకేక్‌కట్‌చేసి నాయకులకు తినిపించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప, నాయకులు నాగరాజు, అనీల్, ప్రెస్ వెంకటేశ్, షఫీ, రామాంజినమ్మ, చౌదరి, బాచి, రమేష్, అమర్నాథ్, జేపీకే రాము పాల్గొన్నారు.



బాలయ్యకు కేక్ తినిపిస్తున్న పట్టణాధ్యక్షుడు రమేష్

కొన్నాళ్లుగా నీటి వృథా



పైపులైన్ లీకేజీతో ఏర్పడిన నీటికుంట

గోరంట్ల, ఏప్రిల్ 20: పట్టణంలోని మోహన్‌రావు కాలనీ వద్ద మరవ ఆంజనేయస్వామి ఆలయానికి వెళ్లే రహదారి పక్కన పైపులైన్ పగిలి నీరు వృథా అవుతోంది. పట్టించుకునేవారే లేరు. కొంతకాలం కిందట ఆ ప్రాంతంలో ఎక్స్‌కవేటర్‌తో పనులు చేస్తుండగా పైపులైన్ పగిలినట్లు ఆప్రాంతవాసులు తెలిపారు. పంచాయతీ వారు పలు మార్లు మరమ్మతులు చేసినా, మళ్లీ పగిలిపోతూ నీరు వృథా అవుతోంది. అంతేగాకుండా ఆ ప్రాంతంలో నీటి మడుగుగా ఏర్పడింది. దుర్గంధం వెదజల్లుతోంది. ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఉన్న బోరునుంచి పైపులైన్ గుండా ట్యాంక్‌కు నీరు చేరుతోంది. మోటారు పనిచేయని సమయంలో మురుగుగుంటలోని నీరు పైపులైన్ ద్వారా ట్యాంక్‌కు చేరుతూ నీరు కలుషితమవుతోంది. గతంలో పంచాయతీవారు గోరంట్లలో వారంరోజులకు ఒకసారి కొళాయిల కు నీరు వదిలేవారు. ప్రస్తుతం బోర్లలో నీటిమట్టం తగ్గడం, విద్యుత్‌కోతలు, మోటార్ల మరమ్మతుల కారణంగా నీరు కొళాయిలకు వదలడానికి రెండువారాలకు పైగా పడుతోంది. పుట్టపర్తి నుంచి పార్నపల్లి నీరు గోరంట్ల చేరేందుకు పైపులైన్ ఏర్పాటు చేసినా... రోడ్డు విస్తరణ పనులు, మరమ్మత్తుల కారణంగా సరఫరాకు తీవ్ర సమస్య ఎదురవుతున్నట్లు తెలిసింది. పంచాయతీ అధికారులు వెంటనే స్పందించి నీటి వృథాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

కళాశాలలో ఘనంగా ఫేర్‌వెల్ పార్టీ

పెనుకొండ, ఏప్రిల్ 20 : స్థానిక పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీకళాశాలలో శనివారం ఫేర్‌వెల్ పార్టీని ఘనంగా నిర్వహించారు. జూనియర్ విద్యార్థులు, సీనియర్ విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమానికి వైస్ ప్రిన్సిపాల్ జయప్ప అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడేతత్వాన్ని అలవరచుకుని లక్ష్యం వైపు పయనిస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థులు పరీక్షలు బాగా రాసి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలన్నారు. వివిధ పోటీల్లో సేవా కార్యక్రమాల్లో పాల్గొన్న విజేతలకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఐక్యూకోఆర్డినేటర్ యశోదరాణి, అధ్యాపకులు శ్రీదేవి, ప్రతాప్, రామన్న, నారాయణప్ప, చంద్రమోహన్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వైస్ ప్రిన్సిపాల్ జయప్ప

కారు బోల్తా.. భార్య మృతి

- భర్తకు తీవ్రగాయాలు



ఉమామహేశ్వరి (ఫైల్)

కదిరిఅర్బన్, ఏప్రిల్ 20: మండలంలోని కౌవులేపల్లి వద్ద శు క్రవారం అర్ధరాత్రి సమయంలో కా రు బోల్తాపడిన ఘటనలో ఒకరు మృతి చెందగా, మరొకరికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. కదిరి పట్టణానికి చెందిన దివాకర్, ఉమామహేశ్వరి దంపతులు ప్రభుత్వ ఉపాధ్యాయులుగా విధులు నిర్వర్తిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు. పెద్దకుమారుడు సందీప్ బీటెక్ చదువుతుండగా, రెండో కుమారుడు జయదీప్ ఇటీవల పది పరీక్షలు రాశాడు. కాగా చిన్నకుమారుడికి ఇంటర్ ప్రవేశాలకోసం భార్యభర్త తిరుపతికి శుక్రవారం ఉదయం కారులో వెళ్లారు. పని అనంతరం వెంటనే తిరిగి వస్తుండగా పదినిమిషాలకు గమ్యస్థానానికి చేరుకునే సమయంలో కౌలేపల్లి వద్ద కారు ముందరి టైర్ పగలి బోల్తాపడింది. ప్రమాదంలో ఉమామహేశ్వరి(45) అక్కడిక్కడే మృతిచెందగా, దివాకర్‌కు గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో క్షతగాత్రుడిని కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలు కదిరి రూరల్ పరిధిలోని గంగన్నగారిపల్లి ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

పుట్టపర్తి రూరల్, ఏప్రిల్ 20: పుట్టపర్తి మునిసిపాలిటీ పరిధిలోని ఎనుమల పల్లి చెరువు సమీపంలో గల వ్యవసాయ బావిలో శనివారం గుర్తుతెలియని మృతదేహం లభ్యమైనట్లు పట్టణసీఐ కొండారెడ్డి తెలిపారు. మృతిచెంది నాలుగైదురోజులు కావడంతో మృతదేహం బాగా కుళ్లిపోయిందని, దీంతో ఆనవాళ్లు గుర్తించడం కష్టతరంగా మారిందని అన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు. కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

ఐదేళ్లుగా అద్దె భవనాల్లోనే ఆర్బీకేలు

- అద్దెలు చెల్లించని వైనం
- అధికారులపై ఒత్తిడి చేస్తున్న భవనాల యజమానులు

మడకశిర రూరల్, ఏప్రిల్ 20: గ్రామీణ ప్రాంతాల్లోని రైతులకు మెరుగైన సేవలు అందించాలనే ఉద్దేశంతో పంచాయతీ కేంద్రాల్లో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటుచేశారు. వాటికి పక్కాభవనాల కోసం స్థలాన్ని కూడా సేకరించారు. నిధులు కేటాయించారు. ఐదేళ్లు అయినా వాటి నిర్మా ణాలు పూర్తికాలేదు. దీంతో కొన్నిటిని అద్దెభవనాల్లో, మరి కొన్ని టిని కమ్యూనిటీ భవనాల్లో వాటిని నిర్వహిస్తున్నారు. మండలం లో 18 రైతు భరోసా కేంద్రాలు ఉన్నాయి. ఒక్కొక్క భవని నిర్మాణానికి రూ.21.80 లక్షల నిధులు కేటాయంచారు. ఇప్పటి వరకు పనులు పూర్తి కాకపోవడంతో కొన్ని అద్దెభవనాలు, మరి కొన్నికమ్యూనిటీ భవనాలు కొనసాగుతున్నాయి. వైసీపీ ప్రభుత్వం మాత్రం రైతు భరోసాకేంద్రాలన్నింటికి పక్కా భవనాలు నిర్మించినట్లు గొప్పలు చెబుతోంది. నిధుల కొరత కారణంగా ఒక్క భవనం నిర్మాణం కూడా పూర్తికాలేదని రైతులు వాపోతున్నారు. మండలంలోని భక్తరహళ్ళి, బుళ్ళసముద్రం, ఛత్రం, సీ కోడిగేపల్లి, కదిరేపల్లి. ఏఆర్ రొప్పం రైతు భరోసా కేంద్రాలను ఇప్పటికీ అద్దె భవనాల్లోనే నిర్వహిస్తున్నారు. మిగిలిన కేంద్రాలను ఆయా గ్రామాల్లోని మహిళ కమ్యూనిటీ భవనాల్లో నిర్వహిస్తున్నారు రైతు భరోసా కేంద్రలు నిర్మించడానికి కాంట్రాక్టర్లు మొదట్లో ఎంతో ఉత్సాహంతో పనులు ప్రారంభించారు. పునాదులు వరకు సక్రమంగా సాగాయి. అయితే ఆ తరువాత నిధులు కొరత కారణంగా పనులు వివిధ దశల్లో నిలిచిపోయాయి. ఇదిలా ఉంటే అద్దె భవనాలకు ఐదు నెలలుగా అద్దెలు చెల్లించలేదు. దీంతో భవనాల యజమా నుల వత్తిడి పెరిగింది. ఈ కారణంగా అక్కడ పనిచేసే వ్యవసాయాధికారులు కియోస్కార్ యంత్రాన్ని గ్రామ సచివాలయంలో ఉంచి అక్కడ నుంచి పనులు చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అద్దె భవనాలకు అద్దెలు చెల్లించి రైతు భరోసా కేంద్రా నిర్వహించే విధంగా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. దీనిపై మడకశిర ఏఓ తిమ్మప్ప మాట్లాడుతూ.... పలు రైతు భరోసా కేంద్రాలను అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారని తెలిపారు. వాటి అద్దెలను త్వరలో చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.



అద్దెలు చెల్లించక సీ కోడిగేపల్లి సచివాలయంలో ఉంచిన కియోస్కార్ యంత్రం



సీ కోడిగేపల్లిలో అద్దె భవనంలో కొనసాగుతున్న రైతు భరోసాకేంద్రం



ఆమిదాలగొందిలో నిధుల కొరతతో పునాదులకే నిలిచిపోయిన దృశ్యం

సూపర్ సిక్స్ పథకాలపై టీడీపీ ప్రచారం

రొద్దం, ఏప్రిల్ 20 : అమ్మఒడి కింద ప్రతి విద్యార్థికి యేటా రూ.15వేలు నగదు అందిస్తామని టీడీపీ నాయకులు పేర్కొన్నా రు. రొద్దం మండల పరిధిలోని సానిపల్లి సుబ్బరాయప్ప కొట్టాల గ్రామంలో శనివారం టీడీపీ నాయకులు ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం నిర్వహించారు. టీడీపీ కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాధవనాయుడు, చిన్నప్పయ్య, నరసింహులు, చంద్రమౌళి, వెంకటరామిరెడ్డి, హరీష్, సానిపల్లి, టీడీపీ కార్యకర్తలు హరీష్, సానిపల్లి టీడీపీ కార్యకర్త సూరి, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

'పేదల కాలనీలంటే వైసీపీకి చిన్నచూపు'

పెనుకొండ టౌన్(సోమందేపల్లి): అధికార పార్టీ వైసీపీకి పేదల కాలనీలంటే చిన్నచూపని సోమందేపల్లిలోని సీపీఐ కాలనీ వాసులు మండిపడ్డారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివా రం టీడీపీ నాయకుడు నీరుగంటి చంద్ర ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు సోమందేపల్లిలోని పలు ప్రాంతాల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సూపర్‌సిక్స్ పథకాలను వివరిస్తూ టీడీపీ కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు. అలాగే టీడీపీ నాయకులు సురేష్, కిష్టప్ప, బాబు, లక్ష్మీనారాయణ, అంజినరెడ్డి, బాబయ్య, ఫక్రుద్దీన్, జబీవుల్లా, నాగరాజు, రత్నమ్మ, అలి వేలమ్మ, శాంతమ్మ, సువర్ణమ్మ, శిరీష తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి బీజేపీలోకి చేరిక

పెనుకొండ రూరల్, ఏప్రిల్ 20: పెనుకొండ పట్టణానికి చెందిన జయరాంయాదవ్ శనివారం బీజేపీలో చేరారు. పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్ ఆయనకు కండువా కప్పి ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి, ఎనుమల రామక్రిష్ణ, అంగడి రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

తప్పుల తడకగా నేమ్ బోర్డు



సంవత్సరం తప్పుగా ఉన్న స్త్రీ శక్తి భవనం నేమ్ బోర్డు

రొద్దం, ఏప్రిల్ 20 : మండలపరధిలోని చోళేమర్రి గ్రామంలో గత టీడీపీ ప్రభుత్వ కాలంలో రూ.8లక్షల నిధులు మంజూరు చేసి స్త్రీశక్తి భవనం నిర్మించారు. గ్రామైక్య సంఘాల సభ్యులు ప్రతి నెలా సమావేశాలు ఏర్పాటు చేసుకునేందుకు దీన్ని నిర్మించారు. ఎంజీఎన్ఆర్ఈజీఎస్ పథకం, ఎస్‌డీఎఫ్ నిధులతో భవన నిర్మాణం పూర్తిచేశారు. ప్రభుత్వ ఆశయాలు, ప్రజాప్రతినిధుల లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాల్సిన అధికారులు నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించారనడానికి ఈ భవనంపై ఏర్పాటు చేసిన బోర్డు నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తోంది. వాస్తవంగా ఆ భవనాన్ని 2015లో నిర్మించారు. కానీ 90015సంవత్సరంలో నిర్మించినట్లు నేమ్‌బోర్డు ఏర్పాటు చేశారు. ఇన్నేళ్లుగా దాని మార్పుకోసం ప్రయత్నించనూ లేదు. దీంతో బోర్డును చూసి ప్రతి ఒక్కరూ ముక్కున వేలేసుకుంటున్నారు.

సీసీ రోడ్డుపైనే మురుగునీరు



ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డుపై నిలిచిన మురుగునీరు

రొద్దం, ఏప్రిల్ 20: మండలపరిధిలోని దొడగట్ట గ్రామ హరిజనవాడలో ప్రధాన రహదారిపై మురుగునీరు నిలిచి దుర్గంధం వెదజల్లుతోంది. దొడగట్ట హరిజనవాడలో గత టీడీపీ ప్రభుత్వ కాలం లో సీసీరోడ్డు వేశారు. అయితే వైసీపీ పాలనలో కనీసం కాలనీలో డ్రైనేజీ నిర్మించకపోవడంతో సీసీరోడ్డుపైనే మురుగునీరు నిలిచి, చిన్నకుంటను తలపిస్తోంది. దోమలకు ఆవాసంగా మారింది. అవి కాలనీలో స్వైర విహారం చేస్తున్నాయి. పైగా భరించలేని కంపుతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మురుగునీటిని మళ్లించాలని ఎన్నోమార్లు పంచాయతీ అధికారులకు విన్నవించినా ఎవరూ పట్టించుకోవడంలేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీవాసులంటే ప్రభుత్వానికి అంత అలుసైపోయామా అని వారు మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి రోడ్డుపై మురుగునీరు నిలువ లేకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ఉపాధి కూలీకి పాముకాటు

నల్లచెరువు, ఏప్రిల్ 20: మండలంలోని రాజంవాండ్లపల్లికి చెందిన ఉపాధి కూలీ ఆంజనేయులు పాముకాటుకు గురయ్యాడు. గ్రామ సమీపంలోని కొండ వద్ద శనివారం ఆయన ఉపాధి పనుల నిమిత్తం కందకాలు తీస్తుండగా.. పాము కాటు వేసింది. గమనించిన తోటి కూలీలు అతడిని కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. తర్వాత మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించినట్లు ఏపీఓ మంజుల తెలిపారు.

షార్ట్‌సర్క్యూట్‌తో రేషం షెడ్డు దగ్ధం

నల్లమాడ, ఏప్రిల్ 20: మండలంలోని పులంగపల్లిలో రైతు కేశవరెడ్డికి చెందిన రేషం షెడ్డు షార్ట్‌సర్క్యూట్ జరిగి దగ్ధమైంది. శుక్రవారం రాత్రి పొద్దుపోయాక షెడ్డుకు దగ్గరలో ఉన్న విద్యుత్ స్తంభంలోని తీగలు షార్ట్ సర్క్యూట్ కావడంతో నిప్పులు షె డ్డుపై పడ్డాయని, దీం తో మంటలు చెలరేగి షెడ్డు దగ్ధమైందని బాధితుడు శనివారం తెలిపారు. షెడ్డులో మూడువందల రేషం గు డ్లు, పురుగులు కాలిపోయినట్లు చెప్పారు. దాదాపు రూ. ఒకటిన్నర లక్ష నష్టం జరిగిందన్నారు. సంబంధిత అధికారులు పరిశీలించి సాయం చేయాలని ఆయన కోరారు.